Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 28.06.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• నెరవేరిన 'వై.యస్. సేవాసమితి' ఆశయం



10లో

## రైతు దినోత్సవంగా... రాజన్న జన్మదినం

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెలరోజులైంది. ఈ నెలరోజుల పాలనే ఎన్నో సంచలనాలకు వేదికగా మారింది. 'లీడర్', 'ఒకే ఒక్కడు', 'భరత్ అనే నేను'... వంటి సినిమాలను జగన్మోహన్‌రెడ్డి ఈ నెలరోజుల్లోనే చూపించేశాడు.



# అక్రమాలపై... ఉక్కుపాదం

- సినిమా కాదు... వాస్తవం చూపిస్తున్నాడు
- అక్రమార్కుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తున్నాడు
- కరకట్ట నుండే అక్రమాల అడ్డుకట్టకు శ్రీకారం

'లీడర్', 'ఒకే ఒక్కడు', 'భరత్ అనే నేను'... వంటి సినిమాలను చూసినప్పుడు.. ఇలాంటి సినిమాలు తీయడానికి పనికొస్తాయిగాని, ఆచరణసాధ్యమయ్యేవి కాదని అందరూ అనుకున్నారు. ఆ సినిమాలలోని సన్నివేశాలను ఎంటర్‌టైన్‌మెంట్‌గానే భావించేవాళ్ళు. సినిమా వేరు... వాస్తవాలు వేరు అనుకునేవాళ్ళు. కాని ఇక్కడ జగన్ పరిపాలనా విషయానికొస్తే... పరిపాలనే సినిమాగా వుంటుందో... సినిమాను తలదన్నేలా పరిపాలన ఉంటుందో అర్ధం కావడం లేదు. ముఖ్యంగా గత ఐదేళ్ళు ఓ చెత్తసినిమాలాంటి పరిపాలన చూసిన అధికారయంత్రాంగానికి ఉన్నట్లుండి 'బాహుబలి' వంటి బంపర్ హిట్ సినిమాను చూస్తున్నట్లుగా వుంది. (మిగతా 11వ పేజీలో)

# ఈ జీవితం ధన్యం!




వెంకన్న సేవకుడిగా బాధ్యతలు తీసుకున్న సుబ్బన్న 3లో




# టీడీపీ సెల్ఫ్‌గోల్!

- బాబు గారి డైరెక్షన్‌లోనే ఎంపీల యాక్షన్
- అవినీతి కేసుల భయంతోనే బీజేపీకి దాసోహం



సుజనాచౌదరి... సీఎం రమేష్... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కుడిభుజం ఒకరు, ఎడమ భుజం ఇంకొకరు. ఇద్దరికీ కూడా చంద్రబాబు బినామీలనే ప్రచారముంది. 2004-2014ల మధ్య తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు ఆ పార్టీని అన్ని విధాలా సాకింది ఈ ఇద్దరే! ఆర్థికంగా మూలస్థంభాలుగా నిలిచింది వాళ్ళే! ఈమధ్యేగా పార్టీకి ఖర్చుపెట్టిన ఆ డబ్బంతా బ్యాంకులను ముంచి అప్పుగా తీసుకున్నాడని, వీళ్ళ ఆర్థిక సహకారానికి ప్రతిఫలంగానే తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక వీళ్ళను రాజ్యసభ సభ్యులుగా, వీరిలో ఒకరిని కేంద్రమంత్రిగా కూడా చేశాడని లోకానికి తెలిసింది.

చంద్రబాబు మీద అలిగి నారా లోకేష్ లేదా నందమూరి బాలకృష్ణ అయినా పార్టీ మారారంటే జనం నమ్ముతారేమోగాని సుజనాచౌదరి, సీఎం రమేష్‌లు తెలుగుదేశాన్ని వదిలి బీజేపీలో చేరారంటే వారి చిత్తశుద్ధిని ప్రజలు నమ్మడంలేదు. శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదన్నట్లు చంద్రబాబు ఆజ్ఞ లేనిదే వీళ్ళు పార్టీ మారరని, చంద్రబాబు ప్రోత్సాహంతోనే వీళ్ళు (మిగతా 11వ పేజీలో)

# పొంచివున్న మృత్యువు

తవ్వి వదిలేసిన బోరుబావుల గుంతల్లో మృత్యువు పొంచివుంటుందని, కనుక వెంటనే అస్తవ్యస్తంగా తవ్విన బావులను మూసివేయాలని, బోరుబావులు తవ్వినచోట ప్రమాదాలు జరగకుండా బోర్డులు పెట్టాలని, బోరుబావుల్లో చిన్నారులు ప్రమాదవశాత్తు పడిపోకుండా గట్టి రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం, జిల్లా అధికారయంత్రాంగం ఎంతోకాలం నుంచి పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ బోరుబావులను సరిగా పూడ్చకపోవడం వల్ల చిన్నారుల మరణాలు తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం బోరుబావుల తవ్వకాలు, నిర్వహణకు సంబంధించి ఒక సమగ్రమైన చట్టాన్ని రూపొందిస్తే తప్ప ఇలాంటి దుర్ఘటనలు.. ఆగవు.

- చిన్నారిని మింగేసిన బోరుబావి
- విడవలూరు మండలంలో దారుణం
- బోరుబావుల నిర్వహణపై పటిష్ట చట్టం అవసరం



చిన్నారి మోక్షితను మింగేసిన బోరుబావి

జిల్లాలోని విడవలూరు మండలంలో ఓ బోరుబావికి ఓ చిన్నారి బలైపోయింది. ఈనెల 24న ఈ ఘోరం జరిగింది. విడవలూరు మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలో మూడేళ్ళ వయసున్న ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ..ఒకరు ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోగా, మరోబాలుడు బోరుబావిలోకి తొంగిచూసి ఆ బావిలోకి జారిపోయాడు. స్థానికులు వెంటనే గమనించి వారిని వెలికితీసేందుకు తీవ్రంగా ప్రయత్నించి ఒకరిని మాత్రం ప్రాణాలతో కాపాడగలిగారు. ఇక్కడున్న పాఠశాలలో తాగునీటికోసం నూరడుగుల లోతున బోరుబావిని తవ్వి పైపులు వేసినా, బావిని పూడ్చలేదని, బావివద్ద ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ బోరుబావికి దగ్గర్లోనే పామంచి పోతయ్య, ఎల్లంగారి ఈశ్వరయ్యల కుటుంబాలున్నాయి. తాతయ్య కుమారుడు గోపిరాజు, ఈశ్వరయ్య కూతురు మోక్షిత ఆడుకుంటూ బోరుబావి వద్దకు వెళ్ళారు.



మృత్యుంజయుడు గోపిరాజును ఆప్యాయంగా ఎత్తుకున్న ఎమ్మెల్యే ప్రసన్న

మొదట మోక్షిత ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయిందని, గోపిరాజు మోక్షితను వెతుక్కుంటూ వచ్చి ఈ బోరుబావిలోకి తొంగిచూసి జారిపడిపోయాడని అంటున్నారు. చిన్నారులు బోరుబావి వద్ద పడిపోవడం గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేస్తూ పరుగెత్తుకు వచ్చి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. దీంతో గోపిరాజు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. మోక్షిత మాత్రం మృత్యు ఒడిలోకి ఒరిగిపోయింది.


### వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న :

ఈ సంఘటన సమాచారం అందిన వెంటనే కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న స్పందించారు. నిమిషాల వ్యవధిలోనే ఎమ్మెల్యే సంఘటనాప్రాంతానికి వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది అందరూ అక్కడికి పరుగున వచ్చారు. సుమారు 15అడుగుల లోతులో పడి ఈ చిన్నారులు ఇరుక్కుపోవడంతో ఎక్స్‌వేటర్ సాయంతో బోరుబావికి సమాంతరంగా గుంతను తవ్వి, దాదాపు అయిదున్నర గంటలపాటు శ్రమించి ఈ చిన్నారులను బయటకు తీశారు. బాలిక అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే కోవూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఈ సంఘటన తెలిసి గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి వచ్చారు. నెల్లూరు ఆర్డీఓ చిన్నికృష్ణ ఆ గ్రామానికి వెళ్ళి ఆ చిన్నారుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రుల వేదన హృదయవిదారకంగా ఉంది.

### ఇకనైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలి :

బోరుబావుల నిర్వహణలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అటు ప్రభుత్వం, ఇటు జిల్లా ఉన్నతాధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అసలు జిల్లా ఉన్నతాధికారుల అనుమతి లేనిదే బోరుబావులు తవ్వరాదని, ఒకవేళ అనుమతుల మేరకు తవ్వినా ఆ తవ్వకాల వల్ల ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి రక్షణ చర్యలు తీసుకునే బాధ్యత ఆయా బోర్ల యజమానులు, లేదా నిర్వాహకులదేననే ఖచ్చితమైన నియమావళితో వారికి బాధ్యతలను అప్పగించాలి.

ఏదేమైనా, అభంశుభం తెలియని చిన్నారుల ప్రాణాలను బలితీసుకుంటున్న ఈ బోరుబావుల తవ్వకాలు, నిర్వహణలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఒక పటిష్టమైన చట్టం రూపొందిస్తే తప్ప... ఇలాంటి మరణాలు ఆగవు.



# ఈ జీవితం ధన్యం!



టిటిడి ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాడేపల్లిలో సీఎం వై.యస్.జగన్‌ను కలిసి తిరుమల ప్రసాదాన్ని అందజేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

తన గుండెలపై ఏ దేవుడినైతే అనుక్షణం ప్రతిష్టించుకున్నాడో ఆ దేవుడి గుడి సేవకు శ్రీకారంచుట్టాడు యర్రం వెంకటసుబ్బారెడ్డి(వై.వి.సుబ్బారెడ్డి). తన ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి సేవకు అంకితమవుతూ జూన్ 22వ తేదీ శనివారం రోజున ఉదయం 11.47నిముషాలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్‌గా ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీవారి సన్నిధిలో ఆ దేవదేవుడి పాదాల చెంద ఇ.ఓ అనిల్‌కుమార్ సింఘల్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి వై.వి.సుబ్బారెడ్డి సతీమణి శ్రీమతి స్వర్ణమ్మతో పాటు వారి కుటుంబసభ్యులు, అలాగే డిప్యూటి సీఎం నారాయణ స్వామి, విద్యాశాఖామంత్రి ఆదిమూలం సురేష్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, కె.రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, సినీ నిర్మాత దిల్ రాజు, రిలయన్స్ ప్రతినిధి మాధవరావు తదితరులు హాజరయ్యారు.

21వ తేదీ సాయంత్రం తిరుపతికి చేరుకున్న వై.వి.సుబ్బారెడ్డి తొలుత తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కాలినడకన మెట్టు మార్గం ద్వారా తన సతీమణి స్వర్ణమ్మతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. 22వ తేదీ ఉదయం కళ్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. సాంప్రదాయంగా వరాహస్వామిని దర్శించుకున్న అనంతరం శ్రీవారి దర్శనానికి వెళ్ళారు. టిటిడి ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.వి.సుబ్బారెడ్డిని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరుజిల్లాల నుండే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రముఖులు కలిసి అభినందనలు తెలిపారు. టిటిడి ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టాక వై.వి.సుబ్బారెడ్డి నేరుగా ఇడుపులపాయకు వెళ్ళి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అలాగే తాడేపల్లి వెళ్ళి ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వామివారి ప్రసాదాలు అందించి సత్కరించారు.

## అవినీతి నిగ్గు తేల్చే కమిటీలో..

# నలుగురు నెల్లూరోళ్ళే!



గత 5ఏళ్ళ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి కుంభకోణాలను అక్రమాలను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో ముగ్గురు ఎంపీలతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా మన జిల్లాకు చెందిన రాజ్యసభసభ్యులు వి.విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను నియమించడం గమనార్హం. గత ఐదేళ్ళ పరిపాలనలో దాదాపు 30అంశాలపై విచారణకు ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. సిఆర్‌డిఏ, భూముల కేటాయింపు, మైనింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టుల అంచనాలు, తదితర అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి ఈ కమిటీ ఆరు వారాలలోగా సీఎంకు నివేదిక ఇవ్వాల్సి వుంది.

## వరసుందరంపై వేటు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వరసుందరంపై వేటుపడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వున్నందుకుగాను ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓ రమాదేవిని నియమించారు.

# 2020 ఏప్రిల్

## పెన్నా బ్యారేజీ పూర్తికి గడువు



పెన్నా బ్యారేజీ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి అనిల్

తెలుగుదేశం ప్రభుత్వ ఐదేళ్ళకాలంలో పెన్నా బ్యారేజీని ఇంకో నాలుగు నెలల్లో ప్రారంభిస్తామంటూ వాయిదాలు వేస్తూనే నెట్టుకొచ్చారు. అలా చెప్పుకుంటూ ఐదేళ్ళు గడిచాయేగాని బ్యారేజీ పూర్తి కాలేదు. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం వెళ్లిపోయింది.

వైసిపి ప్రభుత్వంలో జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి.అనిల్‌కుమార్‌యాదవ్ తొలిసారిగా తన నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు బ్యారేజీని 26వ తేదీన పరిశీలించారు. పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, ఏమేం పనులు మిగిలివున్నాయని అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు నగర ప్రజల చిరకాల స్వప్నంగా వున్న నెల్లూరు బ్యారేజీని వచ్చే ఏడాది ఏప్రిల్ నెలకల్లా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా అనిల్ చెప్పారు.



## 'ప్రభా'తం

# ఈ అకృత్యాలకు అంతే లేదా?

**దేశంలో నానాటికీ అబలల పట్ల అరాచకాలు, మహిళల పట్ల ఘోరాలు, అసహాయులైన బాలికల పట్ల అత్యాచారాలు, అకృత్యాలు పెచ్చుమీరిపోతున్నాయి. కనీస మానవత్వం కూడా లేని రాక్షసమూక పైశాచికత్వాలకు ఇక అంతే ఉండడం లేదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు దోషులకు కఠినశిక్షలు విధించాలి. అదేవిధంగా, సమాజంలో నైతిక విలువల సముద్ధరణకు అందరూ కంకణం కట్టుకోవాలి. అత్యాచారాలు, అకృత్యాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలి!**

దేశంలో నానాటికీ అబలల పట్ల అరాచకాలు, మహిళల పట్ల ఘోరాలు, అసహాయులైన బాలికల పట్ల అత్యాచారాలు, అకృత్యాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఎక్కడ చూసినా మహిళల పట్ల లైంగికవేధింపులే. యువతుల పట్ల అసభ్య వికారపు చేష్టలే!.. చివరికి చిన్నపిల్లలన్న కనీస మానవత్వం కూడా లేని రాక్షసమూక పైశాచికత్వాలకు ఇక అంతే ఉండడం లేదు. వీరు మనుషులా పశువులా అని ఎంతగా ఈసడించుకున్నా సరే, ఎన్నివిధాల కఠినదండనలు విధిస్తున్నా సరే.. ఈ మానవమృగాల వికృతాలు ఆగడం లేదు. వీరు చేస్తున్న దురాగతాలను బయటకు చెప్పుకోలేక, ఏమి చెప్పుకున్నా తమ పరువే పోతుందనే భయంతో గుడ్లనీరు కుక్కుకుని నిత్యం మరెందరో అబలలు కంటికిమింటికి ఒకటే వేదనగా రోదిస్తూనే ఉన్నారు.

స్త్రీలను దేవతగా.. మాతృమూర్తిగా పూజించే భారతావనిలో నేటికీ మహిళలపట్ల ఎంతో ఘోరంగా అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతూనే ఉండడం దారుణం!.. సభ్యసమాజమే సిగ్గుతో తలదించుకునేవిధంగా దేశవ్యాప్తంగా రోజూ ఇలాంటి అనేక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నేటి అధునికకాలంలో మానవతా విలువలు, నైతిక విలువలన్నవి మృగ్యమైపోతుండడం ఎంతైనా బాధాకరం!... సత్సంప్రదాయాలకు, సదా చారాలకు.. ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన.. గొప్పదైన మానవీయ సంస్కృతికి పుట్టినిల్లయిన మనదేశంలో.. శాంతికి సహనానికి.. సమతా మమత లకు నెలవైన మన పుణ్యభూమిలో ఇంకా అమానవీయమైన ఇలాంటి ఘోరాలు నేరాలు జరుగుతూనే ఉండడం దారుణం!..అత్యంత బాధాకరం!...

ఇటీవలే వరంగల్ జిల్లాలోని హన్మకొండలో జరిగిన సంఘటన మనిషి అన్నవాడిని కంటతడి పెట్టిస్తాయి. పైశాచికత్వానికే పరాకాష్టగా జరిగిన ఈ ఘోరంలో.. తల్లి ఒడిలో ఉన్న తొమ్మిదినెలల పసిగుడ్డును అపహరించుకుపోయి అఘాయిత్యం చేసి అంతం చేసిన ఓ హోటల్ క్లీనర్ కిరాతకత్వాన్ని ఏమనాలి?.. పిశాచాల కంటే ఘోరంగా ప్రవర్తిస్తున్న ఇలాంటి మానవమృగాల అరాచకాలకు అంతే లేదా?... రానురాను బాలలకు, అబలల మానప్రాణాలకు రక్షణ లేకపోతుండడం, అంతటా అభద్రతాభావం ఏర్పడుతుండడం పట్ల దేశప్రజల్లో తీవ్ర అసంతృప్తి, ఆవేదనలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా, ఒంగోలులో ఒక బాలికపై ఆరుగురు సామూహిక అత్యాచారం చేశారన్న సంఘటన మహిళాలోకాన్ని భయకంపితురాల్ని చేస్తోంది. ఒడిశాలోని జోడా ప్రాంతంలో ఓ బాలికపై అయిదుగురు యువకులు సామూహిక అత్యాచారం ఘటన మరింత ఘోరం. ఇలాంటి దారుణాలకు అంతమెప్పుడో అర్థంకాని పరిస్థితి. ఇక హైదరాబాద్ భాగ్యనగరం కూడా..అభాగ్యులైన అబలల పాలిట నరకంగానే మారిపోతోంది. ఈ ఏడాదిలోనే భాగ్యనగరంలో వెయ్యికిపైగా ఇలాంటి అమానుష సంఘటనలు జరిగాయని అంచనా!..ఇలా ఎక్కడో ఒక చోటని కాదు.. దేశవ్యాప్తంగా అన్ని చోట్లా ఇలాంటి అకృత్యాలు పెరిగిపోతూనే ఉన్నాయి. విచ్చలవిడిగా సంచరిస్తున్న మానవమృగాల మాయల్లో చిక్కి విలవిల్లాడే మహిళ లకు, అబలలకు లెక్కే లేదు. దేశవ్యాప్తంగా నిత్యం ఇలాంటి ఘోరాలు నేరాల సంఖ్య అంతకంతకు పెరిగిపోతూనే ఉంది. చిన్నాపెద్దా తేడా లేదు..అడ్డూ అదుపూ అసలే లేదు...ఎన్ని రకాల చట్టాలు వచ్చినా, ఎంత గట్టి శిక్షలు అమలవుతున్నా అత్యంత పైశాచిక ప్రవృత్తి కలిగిన మానవమృగాల పీడ ఎంతకూ వదలడం లేదు. మాతృస్వరూపాలైన మహిళామతల్లుల పట్ల ఎంతో గౌరవంతో ఉండాల్సింది పోయి.. అత్యంత హేయమైన, జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తిస్తూ పసిపిల్లల పట్ల అమానుషత్వాలకు పాల్పడుతుండడం, మహిళలను అవమానాలకు, అత్యాచారాలకు గురిచేస్తుండడం ఎంతైనా బాధాకరం! నిర్భయ చట్టాలు వంటి ఎన్ని పటిష్టమైన చట్టాలు వచ్చినా, మరెంత కఠినమైన శిక్షలు పడుతున్నా ఈ అత్యాచారాలు..లైంగిక నేరాలు మాత్రం తగ్గడం లేదు. ఇలా ఎన్ని చట్టాలు వచ్చినా లెక్కలేనితనంతో నేరస్తులు విచ్చలవిడిగా రాకాసి ప్రవృత్తిని కొనసాగిస్తూనే ఉండడం పట్ల సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనల్లోని దోషులకు ఎలాంటి కాలయాపనా లేకుండా కఠినశిక్షలు పడేందుకు అవసరమైన చర్యలన్నీ వెంటనే చేపట్టినప్పుడే కొంతకు కొంతైనా భయం ఉంటుంది. శిక్షలు కూడా మరింత కఠినంగా ఉండాలి. ఆ శిక్షలు చూస్తే.. ఇక ఎవరూ ఇలాంటి అకృత్యాలకు పాల్పడనివిధంగా ఉంటే తప్ప.. ఈ దురంతాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. అందులోనూ నానాటికీ సమాజంలో విచ్చలవిడితనం పెరిగిపో తోంది. పెడమార్గాలు పట్టిన యువత మత్తుపదార్థాల ఊబిలో పడిపోతోంది. పాశ్చాత్య సంస్కృతి మాయాజాలం సమాజాన్ని కమ్మేసి.. నైతిక విలువలకు పాత రేస్తోంది. స్త్రీని ఒక వ్యాపార వస్తువుగా, ఆటబొమ్మగా పరిగణించే అత్యంత హేయమైన విషసంస్కృతి నుంచి యువత వెంటనే బయటపడాలి. అంతేకాదు, ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరించి వీటన్నిటినీ అరికట్టాలి. మాదకద్రవ్యాలు, అమ్మాయిల అక్రమ రవాణా, తరచూ బాలల అదృశ్యం... వంటి సంఘటనల్లోనూ వాటి వెనుకనున్న అరాచకశక్తుల పీచమణిస్తే తప్ప ఇలాంటి ఘోరాలు తగ్గవు. శిక్షలు గట్టిగా ఉంటే తప్ప ఈ నేరాలు ఆగవు. అంతేకాదు, చిన్నతనం నుంచి.. పిల్లలు బడిబాట పట్టినప్పుడే వారిలో ఎంతో సంస్కారవంతమైన మన సంస్కృతి సంప్రదాయాలు, సదాచారాలను తెలియజెప్పాలి. ముఖ్యంగా నైతిక విలువల సముద్ధరణకు కంకణం కట్టుకోవాలి. మంచిని ఆచరించేలా చూడాలి. మహోన్నతమైన మానవీయత అందరిలోనూ పరిమళించేలా.. మానవత్వపు గొప్పదనాన్ని చాటాలి. తల్లిదండ్రులను, గురువులను గౌరవించేలా, మహిళలను తమ అక్కచెల్లెళ్ళుగా ఎంతో గౌరవంగా చూసేలా తీర్చిదిద్దాలి. చిన్నారుల స్థాయినుంచే ఇలాంటి ఉత్తమ గుణాలతో రాణిస్తూ..వారు భావిభారత పౌరులుగా సగర్వంగా ఎదిగేలా చూసినప్పుడే భావిభారతమైనా ఇలాంటి దురాగతాలకు దూరంగా ఉంటుంది. ఆ గురుతరబాధ్యతను ఎవరూ విస్మరించకూడదు. మన చుట్టూ ఉన్న మనుషులను, మన సమాజాన్ని ఎప్పటికప్పుడు మనమే పవిత్రం చేసుకోవాలి. పవిత్రమైన భారతావనిని మరింత పవిత్రంగా చూసుకోవాలి. అప్పుడే ఇలాంటి విషసంస్కృతి నుంచి ఎవరూ చెప్పనవసరం లేకుండానే మనకు మనమే బయటపడగలం!....

# యోగాతో మానసిక ఉల్లాసం

**జేసీ వెట్రి సెల్వీ**

సహజసిద్ధమైన యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు రుగ్మతలకు దూరంగా ఉండే అవకాశం ఉందని జిల్లా సంయుక్త కలెక్టర్ వెట్రి సెల్వీ అన్నారు. ఈనెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి మైదానంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్, యువజన, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా చేయాలని పిలుపునిచ్చారు. సంయుక్త కలెక్టర్-2 ఎస్తేరు సాధన మాట్లాడుతూ పురాతనమైన యోగా ఆవశ్యకతను తెలుసుకుని తిరిగి ప్రాచుర్యంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. నగరపాలక సంస్థ కమీషనర్ అలీం బాషా, మెప్మా పీడీ చిరంజీవి, ఆయుష్ సీనియర్ డాక్టర్ శేఖర్, పద్మజ, జగదీశ్వరి,



సీహెచ్ విజయ, నెహ్రూ యువకేంద్ర సమన్వయకర్త తేజశ్విని, యోగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పాండురంగారావు, నెహ్రూ యువజన కేంద్రం యువకులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ఆటోలో మరచిపోయిన బ్యాగును సొంతదారునికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ ఆటోవాలా. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు మాగుంట లేఅవుట్‌కు చెందిన గోపాలకృష్ణ ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల22న ఆయన మాగుంట లేఅవుట్‌లోని ఓ హోటల్ వద్ద నుంచి తన కుమార్తెతో కలసి ఆటో ఎక్కి కేవీఆర్ పెట్రోలు బంకు సెంటర్ వద్ద దిగి వెళ్ళిపోయారు. కొంత దూరం వెళ్ళిన తర్వాత బ్యాగు కనిపించకపోవడంతో ఆటో కోసం గాలించి ఫలితం లేకపోవడంతో దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాగులో సవర బంగారం, సర్టిఫికెట్లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దర్గామిట్ట సీఐ కరుణాకర్ తన సిబ్బందితో కలిసి ఆటో కోసం గాలించి సీసీ ఫుటేజీల ఆధారంగా ఆటోను గుర్తించి ఆటోడ్రైవర్‌కు ఫోన్ చేశారు. అప్పటికే ఆటో డ్రైవర్ ప్రదీప్‌కుమార్ ఆటోలో వున్న బ్యాగును పరిశీలించి అందులోని సర్టిఫికెట్ల ఆధారంతో బాధితుల కోసం బయలుదేరాడు. అప్పటికే పోలీసులు ఫోను చేయడంతో దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించాడు. ఆటోడ్రైవర్ నిజాయితీకి పోలీసులు, బాధితులు అభినందించారు.




## విలువలకు పాతర

ఒక్క ఎంపీని కొనివుంటే 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం నిలబడి వుండేది. కాని, ఆయన విలువలకు కట్టుబడ్డాడు. ఒక్క ఎంపీని కొన్నా ఒప్పుకునేది లేదన్నాడు. ఒక్క ఓటుతో తన ప్రభుత్వం పడిపోయినా మళ్ళీ ప్రజల్లోకి వెళ్లి ప్రజాతీర్పు కోరి గెలిచాడు. అలాంటి బీజేపీ స్వరూపాన్ని మార్చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి నిజాయితీపరుడిగా పేరుంది. మరి అలాంటి నాయకుడేంటి... బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టిన సుజనాచౌదరి, సీఎం రమేష్ లాంటి రాజ్యసభ సభ్యులను బీజేపీలోకి తీసుకోవడమేంటి? కాస్తోకూస్తో విలువలు వున్న పార్టీగా ఇంతకాలం బీజేపీపై నమ్మకం వుండింది. ఈ ఆర్థిక నేరగాళ్ళను చేర్చుకోవడంతో బీజేపీ కూడా మిగతా పార్టీల కోవలోకే వచ్చినట్లయ్యింది.

*సంగటి మాలకొండారెడ్డి, పాముూరు.*

## దళితులకు అవకాశం కల్పించాలి

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.వి.సుబ్బారెడ్డికి అభినందనలు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలని, స్వామివారి నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని కోరుతున్నాము. ముఖ్యంగా పేద, బడుగు, దళిత వర్గాల ప్రజలకు శ్రీవారి దర్శనం కష్టతరంగా వుంటోంది. సిఫార్సు లేఖలకే వీఐపి దర్శనాలు, సేవలు లభిస్తున్నాయి. గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మెన్‌గా వున్నప్పుడు దళిత గోవిందం పేరుతో దళితవాడలకు స్వామివారిని తీసుకొచ్చారు. అలాకాకుండా స్వామివారి వద్దకే దళితులు వచ్చేలా అవకాశమివ్వండి. సేవలు, బ్రేక్ దర్శనాలలో దళితులకు ప్రాధాన్యతనివ్వండి. దీనివల్ల హైందవ సంస్కృతికి దళితులు దూరం కాకుండా వుంటారు.

*సి.రాజీవి, నెల్లూరు.*

## ఎన్‌కౌంటర్‌లే శరణ్యం

అభం శుభం తెలియని 9నెలల చిన్నారిని కూడా కామాంధులు వదలడం లేదంటే ఈ లోకం ఎక్కడికి పోతుందనుకోవాలి. అసలు ఆ పసి మొగ్గలను చిదిమేయడానికి వీళ్ళకు ఎలా మనసొస్తుంది. ప్రతిరోజూ ఎక్కడోచోట చిన్నారులపై అరాచకాలు, అత్యాచారాలు జరుగుతూనే వున్నాయి. మొన్న ఒంగోలులో ఓ మైనర్ బాలికపై ఆరుగురు కామాంధులు సామూహిక అత్యాచారం జరిగింది. చట్టాలను బట్టి పోతుంటే ఇలాంటి వెధవల్లో కొందరు తప్పించుకోవచ్చు. కాబట్టి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లాగా ఇలాంటి చీడపురుగులను ఎన్‌కౌంటర్ చేసుకుంటూ పోవాలి. మరొకరు ఇలాంటి అకృత్యాలు చేయాలంటేనే వెన్నులో వణుకుపుట్టే విధంగా అలాంటి కామాంధులకు శిక్షలు విధించాలి.

*కొండ్రెడ్డి హైమ, నెల్లూరు.*







# ఆగిన అభివృద్ధి చక్రం...

# తిరిగి కదిలేనా?

***నెల్లూరుజిల్లాకు సంబంధించినంత వరకు 2004-2014ల మధ్యకాలం ఎంతో మంచిదనుకోవచ్చు. ఈ జిల్లా వాస్తవమైన అభివృద్ధిని చూసింది ఆ పదేళ్ళకాలంలోనే!***

2004కు ముందు నెల్లూరుజిల్లాలో పరిశ్రమలు అంటే కోవూరు షుగర్ ఫ్యాక్టరీ, నెల్లూరు, తడ నిప్పో ఫ్యాక్టరీలు తప్ప ఇంకేమీ వుండేవి కావు. వ్యవసాయం, వ్యాపారాలు, ఇతర చిన్నచిన్న వృత్తులే ప్రధాన జీవనాధారం. 2004కు ముందు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు కృష్ణపట్నం పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా, ఆ శిలాఫలకం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయే గాని పోర్టు నిర్మాణం ఒక్క అడుగూ ముందుకు పడలేదు. 2004లో వై.యస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కావడంతోనే నెల్లూరు జిల్లా దశ మారిపోయింది. పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టింది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణాన్ని 'నవయుగ' కంపెనీకి అప్పగించడంతో ఆగమేఘాల మీద పోర్టు నిర్మాణం పూర్తి చేశారు. 2009కల్లా పోర్టు వాడుకలోకి వచ్చింది. పోర్టు సెజ్‌లోకి పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. ఒక్క పోర్ట్ ఏమిటి... చింతవరం సెజ్, మాంబట్టు సెజ్, శ్రీసిటి సెజ్, మేనకూరు సెజ్, ఇఫ్కో సెజ్... అన్నీ వై.యస్. హయాంలోనే వచ్చాయి. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలొచ్చాయి. ఈ సెజ్‌ల మూలంగా భూముల ధరలు అమాంతం పెరిగాయి. రైతులు లబ్ది పొందారు. రియల్‌ఎస్టేట్ రంగం పుంజుకుంది. జిల్లాలో అందరి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. 2009లో వై.యస్. మరణం తర్వాత జిల్లాలోకి కొత్త పరిశ్రమలు రాకపోయినప్పటికీ ఆర్థిక మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి వల్ల నెల్లూరుకు ప్రభుత్వ వైద్యకళాశాల, రోడ్ల నిర్మాణం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలలో భారీ నీటి ప్రాజెక్టులన్నీ మంజూరు కాగలిగాయి.

2014లో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో నెల్లూరుజిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడింది. కొత్త పరిశ్రమలు లేవు. కొత్తగా ఉద్యోగావకాశాలు లేవు. రియల్ ఎస్టేట్ కూడా బాగా పడిపోయింది.

ఇప్పుడు ప్రభుత్వం మారింది. జగన్ సీఎం అయితే నెల్లూరుజిల్లా బాగా అభివృద్ధి చెందుతుందనే ప్రచారం మొదటి నుండి వుంది. ఇప్పుడు ఆ ఆశలు మొలకెత్తాయి. దీనికి తగ్గట్లు జిల్లాకు ఇరిగేషన్, ఐ.టి పరిశ్రమల శాఖల మంత్రులనే ఇచ్చారు. నెల్లూరును ఐ.టి హబ్‌గా మారుస్తామంటూ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చెప్పారు. నెల్లూరుకు ఐ.టి హబ్ ఆశలు లేవుగాని, పరిశ్రమల మంత్రిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టిపెడితే కొత్త పరిశ్రమలను తీసుకురావడానికి అవకాశముంది. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి అనుకూలంగా కృష్ణపట్నం పోర్టు, మేనకూరు, ఇఫ్కో, శ్రీసిటీ వంటి సెజ్‌లున్నాయి. అలాగే మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరిలను కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాల్సివుంది. పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు అందుబాటులో వున్నాయి. మేకపాటి గౌతమ్ దీనిపై ప్రత్యేకశ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా వుంది.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్

## జంట మంత్రులకు

# అపూర్వ స్వాగతం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రిగా మేకపాటి గౌతమ్‌రెడ్డిలు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఈ నెల 22వ తేదీన సొంత జిల్లా నెల్లూరుకు వచ్చారు. విజయవాడ నుండి రోడ్డు మార్గాన నెల్లూరుకు విచ్చేసిన మంత్రులిద్దరికీ కూడా మైపాడు రోడ్డు, పత్తివారిసత్రం వద్ద వేల సంఖ్యలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. జై జగన్... జై అనిల్... జై గౌతమ్.. నినాదాలతో హోరెత్తించారు. పత్తివారిసత్రం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై మంత్రులిద్దరూ కేక్ కట్ చేశారు. అనంతరం ఓపెన్‌టాప్ లారీపై మంత్రులిద్దరూ ఎక్కగా ర్యాలీ బయలుదేరింది. దారిపొడవునా పూలజల్లులతో, బాణాసంచా వెలుగులతో సందడిగా కనిపించింది. మైపాడు గేటు సెంటర్‌లో స్థానిక వైసిపి నాయకులు క్రేన్ ద్వారా భారీ గజమాలతో మంత్రులిద్దరినీ సత్కరించారు. ర్యాలీ నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మల మీదుగా మద్రాసు బస్టాండ్ వరకు సాగింది. పలు సెంటర్‌లలో వైసిపి నాయకులు, అభిమానులు పూలమాలలతో మంత్రులను సత్కరించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో మంత్రులిద్దరూ గాంధీ విగ్రహానికి, అలాగే వై.యస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాదాపు 10 కిలోమీటర్ల దూరం పాటు ర్యాలీ జరుగగా వేలాదిమంది ఈ ర్యాలీ వెంట వుండి తమ అభిమానం చాటుకున్నారు.



క్రేన్ సాయంతో భారీ గజమాలతో మంత్రులను సత్కరిస్తున్న అభిమానులు

## కార్పొరేషన్ కౌన్సిల్...

# టైం అయిపోవచ్చింది





నెల్లూరు నగరపాలక సంస్థ పాలకవర్గం గడువు జూలై 2వ తేదీతో ముగియబోతుంది. ఈ నేపథ్యంలోనే ఈ కౌన్సిల్ చివరి సమావేశంగా ఈ నెల 28వ తేదీన కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలాం సమావేశమందిరంలో చివరి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు.

2014 నుండి 2019 జూన్ దాకా నెల్లూరు కార్పొరేషన్ ఎన్నో వింతలు, విశేషాలకు వేదికగా మారింది. 2014లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మెజార్టీ డివిజన్‌లు సాధించింది. అయితే ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం అధికారంలోకి రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక కార్పొరేషన్, మున్సిపాల్టీల పాలకవర్గాల ఏర్పాటుకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలిచ్చి వుండడంతో గెలిచిన సభ్యులను కాపాడుకోవడం వైసిపి నాయకులకు చాలా కష్టతరంగా మారింది. తన కార్పొరేటర్‌లను అధికార టిడిపి వాళ్ళు ఎక్కడ తన్నుకుపోతారోనని చెప్పి ఆయన తన కార్పొరేటర్లను క్యాంప్‌లకు తరలించారు. మేయర్ ఎన్నిక రోజున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో వారిని కార్పొరేషన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. చేతులెత్తే విధానంలో మేయర్‌ను ఎన్నుకునే విధానాన్ని అప్పుడు అధికారపార్టీ సభ్యులు వ్యతిరేకించడంతో తీవ్ర గందరగోళం నెలకొని, చివరకు అజీజ్‌ను మేయర్‌గా ఎంపిక చేశారు. ఆ తర్వాత నెలతిరక్కుండానే అజీజ్ మరి కొంతమంది కార్పొరేటర్‌లను కలుపుకుని అధికార తెలుగుదేశంలోకి జంప్ చేసి గోడ దూకుడుకు బీజం వేశాడు.

ఇక కార్పొరేషన్‌లో చూస్తే ఆరునెలలకో కమిషనర్‌ను మారుస్తూ పరిపాలనను గాడిలో పెట్టడానికి చాలాకాలం పట్టింది. ముఖ్యంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో మేయర్‌కు ఇతర తెలుగుదేశం నాయకులతో పడకుండా వచ్చింది. అయితే జిల్లాకు చెందిన నారాయణ మున్సిపల్ మంత్రిగా వుండడం వల్ల నగరంలో కొన్నైనా అభివృద్ధి పనులు చేసుకుంటూ వచ్చారు. అయితే గత కౌన్సిల్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసినా, నాణ్యత లేని పనులు చేశారనే ఆరోపణలున్నాయి. కేవలం కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం కోసమే కొన్ని పనులు చేశారేమో అన్నట్లుగా ఆ పనులు చూస్తే అర్థమవుతుంది. ఎట్టకేలకు అవకతవకలు, ఒడిదుడుకులు, రాజకీయ యుద్ధాలు, ఆందోళనల మధ్య అజీజ్ పాలకవర్గం పదవీ కాలం ముగియబోతోంది. మళ్ళీ కార్పొరేషన్ ఎన్నికలు జరిగేవరకు ప్రత్యేక అధికారి పాలనే వుండొచ్చు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# మానవత్వం పరిమళించిన వేళ...

## సహృదయాన్ని చాటుకున్న మంత్రి అనిల్



క్షతగాత్రుడిని తన కాన్వాయ్‌లోని ఓ కారులో ఎక్కించమని చెప్తున్న మంత్రి అనిల్

ముఖ్యమంత్రి వై.యస్.జగన్మో హన్‌రెడ్డి పరిపాలన మానవీయ కోణంలో సాగుతోంది. మంచికి, మానవత్వానికి పెద్దపీట వేస్తోంది. మంత్రులు సైతం ఆయన బాటలోనే నడుస్తున్నారు. దీనికి ఉదాహరణ 24వ తేదీ ప్రకాశం జిల్లా మేదరమిట్ల వద్ద హైవేపై జరిగిన ఓ సంఘటన. ఓ గ్రానైట్ కంపెనీలో పనిచేసే ప్రసాద్ అనే వ్యక్తి మేదరమెట్ల వద్ద బైక్‌పై రోడ్‌క్రాస్ చేస్తుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ క్రింద పడడంతో ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మేదరమెట్ల పోలీసులు అక్కడకు చేరుకుని 108కు సమాచారమందించారు. అయితే అంతలో అమరావతిలో సీఎం నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కోసం నెల్లూరు నుండి తెల్లారుజామునే బయలుదేరిన మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆ సమయంలోనే అక్కడకు చేరుకున్నారు. ఆయన తన కారు దిగి సంఘటనా స్థలికి వెళ్లారు. 108 అంబులెన్స్ అప్పటికి రాకపోవడంతో గాయపడ్డ ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించడానికి తన కాన్వాయ్‌లోని కారును ఇచ్చారు. ఆ కారులోకి ప్రసాద్‌ను ఎక్కించబోతుండగా అప్పుడే 108 అంబులెన్స్ రావడంతో దాంట్లో ఎక్కించి పంపారు. బాధితుడిని అంబులెన్స్ ఎక్కించాక అనిల్ తన కారెక్కి అమరావతి బయలుదేరారు.

# అనిల్‌ను సత్కరించిన కేసీఆర్



ఈనెల 21వతేదీన తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం కోసం ఏపి ముఖ్యమంత్రి వై.యస్.జగన్మో హన్‌రెడ్డి వెంట ఏపి జలవనరుల శాఖమంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ కూడా వెళ్ళారు. ప్రారంభోత్సవం అనంతరం జరిగిన కార్యక్రమంలో అనిల్‌ను తెలంగాణ సీఎం కేసీఆర్ జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

# ఇన్‌ఛార్జ్ మంత్రులు

## నెల్లూరుకు సుచరిత, ప్రకాశంకు అనిల్, చిత్తూరుకు గౌతమ్







నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మేకతోటి సుచరిత గుంటూరుజిల్లా పత్తిపాడు అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందింది. తొలిసారి ఎమ్మెల్యే కావడం ఒకెత్తయితే, ఏకంగా హోం మంత్రి పదవిని దక్కించుకుంది. జిల్లా పరిపాలనా వ్యవహారాలలో ఇన్‌ఛార్జి మంత్రి పాత్ర చాలా కీలకం. జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు నాయకులను సైతం ఆమె సమన్వయం చేసుకుని ముందుకు తీసుకెళ్లాల్సి వుంటుంది.

ఇక మన జిల్లా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించారు. ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి వంటి సీనియర్లు వున్న జిల్లా అది. వారందరినీ అనిల్ సమన్వయపరచుకుని నడపాల్సివుంటుంది.

అలాగే చిత్తూరుజిల్లా ఇన్‌ఛార్జ్‌గా పరిశ్రమల శాఖా మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని నియమించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఆర్.కె.రోజా వంటి సీనియర్ నాయకులను ఆయన సమన్వయపరచుకుని పని చేయాల్సి వుంటుంది.

## నెల్లూరు కబుర్లు

### ఆర్టీసీలో...

## మద్యం బాబులకు పరీక్ష

కొందరు మందుబాబులుంటారు... వారికి పగలు రాత్రి తేడా వుండదు... ఎప్పుడుపడితే అప్పుడు మందు కొట్టడమే. ఇలాంటివాళ్ళు ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగులుగా చెలామణి అవుతుంటారు. మద్యం తాగే కొందరు ఆఫీసులకు వస్తుంటారు. ఆర్టీసీలో ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకే కొత్త పద్ధతి పెట్టారు. ఆర్టీసీలో మెకానికల్ పని ఎక్కువ కాబట్టి మద్యానికి అలవాటు పడ్డవాళ్ళు కొంచెం ఎక్కువగా వుంటుంటారు. ఇప్పటి దాకా ఆర్టీసీలో డ్రైవర్లు, కండెక్టర్లను విధులకు వెళ్లే ముందు మద్యం తాగివున్నారా అన్నది తెలుసుకోవడం కోసం బ్రీత్ ఎనలైజర్‌ల ద్వారా తనిఖీ చేస్తుండే వాళ్ళు. ఇప్పుడు ఒక్క డ్రైవర్లు, కండక్టర్లనే కాకుండా జిల్లాలోని పది డిపోలలో పనిచేస్తున్న అన్ని విభాగాల సిబ్బందిని కూడా విధులకు వచ్చేముందు తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బ్రీత్ ఎనలైజర్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఈ తనిఖీలలో మద్యం తాగి వున్నారని తేలితే మోతాదు పాయింట్లను బట్టి సిబ్బందిపై చర్యలుంటాయి.

## స్పెషల్ బ్రాంచ్‌కు కోటారెడ్డి

నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా ఎన్.కోటారెడ్డిని నియమిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు కోటారెడ్డి ఇదే పోస్టులో వుండినాడు. ఎన్నికల నేపథ్యంలో ఆయనను ఒంగోలు పిటిసికి బదిలీ చేసి, ఆయన స్థానంలో చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ రాంకుమార్‌ను నియమించారు. అయితే ఆయనను కొద్దిరోజులకే అనంతపురం పంపించారు. అప్పటినుండి నెల్లూరు ఎస్‌బి డిఎస్పీ పోస్ట్ ఖాళీగానేవుంది. మొన్న జరిగిన సిఐల బదిలీలలో నెల్లూరు ఎస్‌బి సిఐలిద్దరూ బదిలీ కావడం జరిగింది. దీంతో కోటారెడ్డిని ఎస్‌బి తాత్కాలిక డిఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## విద్యుత్ భవన్‌లో జగన్ ఫోటో

నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఈనెల 24న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఈ ఛాంబర్‌లో ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం ఫోటోను ఆవిష్కరించారు. విద్యుత్ శాఖ డీఇలు శ్రీహరిరావు, అమరబాబు, సునీల్ కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వీఆర్ కళాశాల ప్రిన్సిపల్‌గా

## డా. సుబ్రహ్మణ్యం



నెల్లూరు, వీఆర్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్. యం.సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఆమేరకు కళాశాల ప్రత్యేకాధికారి జేసీ వెట్రిసెల్వీ ఈనెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. సుబ్రహ్మణ్యం వీఆర్ కళాశాలలో ఫిజిక్స్ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. 1982లో వీఆర్ కళాశాలలో తాత్కాలిక అధ్యాపకుడిగా చేరిన ఆయన రెండేళ్ళ అనంతరం రెగ్యులర్ అధ్యాపకుడిగా నియమితులయ్యారు. ప్రిన్సిపల్‌గా ఆయన ఈనెల 26న బాధ్యతలు స్వీకరించారు. సౌమ్యుడిగా కళాశాలలో పేరు సంపాదించుకున్న ఆయనకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

### ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి

## పకడ్బందీ ఏర్పాట్లు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలను అరికట్టేందుకు కార్పొరేషన్ కమిషనర్ ఆలీంబాషా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అయినా కొన్ని ప్రాంతాల్లో కొందరు గుట్టు చప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

### పెన్నా బ్యారేజీకి

## జక్కా వెంకయ్య పేరు పెట్టాలి

నెల్లూరు పెన్నా బ్యారేజీకి మాజీ ఎమ్మెల్యే, రైతాంగ ఉద్యమ నాయకుడు జక్కా వెంకయ్య పేరును పెట్టాలని సీపీయం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు ఈనెల 23న ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులు, కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. సీపీయం జిల్లా కార్యవర్గ సభ్యులు పులిగండ్ల శ్రీరాములు, మోహన్ రావు, నగర, రూరల్ కార్యదర్శులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జి పరీక్షల్లో

## రేస్ విద్యార్థి ప్రతిభ



దేవిత్‌ను అభినందిస్తున్న జి.ఎం రామ్మూర్తినాయుడు

నాల్గవ తరగతి విద్యార్థి అంతర్జాతీయ స్థాయి పరీక్షా పోటీల్లో పాల్గొని ప్రతిష్టాత్మకమైన ర్యాంకును సాధించి తల్లిదండ్రులకు, తాను చదువుకున్న స్కూల్‌కు కీర్తిని సాధించి పెట్టాడు. ఇటీవల అంతర్జాతీయస్థాయిలో జరిగిన ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రపంచంగా నిలిచి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ ఘనత నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు దక్కింది. ఇక్కడ నాల్గవ తరగతి చదువుతున్న బి.దేవిత్ అంతర్జాతీయ జనరల్ నాలెడ్జి పోటీల్లో 26వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 4వ ర్యాంకు సాధించి జనరల్‌నాలెడ్జిలో తన సత్తా చాటుకున్నాడు. వెయ్యి రూపాయల నగదు బహుమతి కూడా పొందాడు. ఈనెల 22న స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డా.కిషోర్స్ జెన్‌నెక్స్ట్ స్కూల్ డైరెక్టర్లు డా.కృష్ణకిశోర్, వాసంతి కిషోర్‌లు దేవిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఆ విద్యార్థిని అభినందిస్తూ కాంస్యపతకాన్ని బహూకరించారు.

### యంసీఏ సెమిస్టర్ ఫలితాల్లో

## కృష్ణచైతన్య విజయదుంధుభి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డా. ఆర్‌వి కృష్ణారెడ్డి

విక్రమ సింహపురి యూనివర్శిటీ విడుదల చేసిన యంసీఏ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంతో పాటు వరుసగా 8 స్థానాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు డా. ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉసా మంజుల 714 మార్కులతో యూనివర్శిటీ ప్రథమ స్థానం సాధించగా, కె.పుష్ప 700 మార్కులతో ద్వితీయ స్థానం, కె.తనూజ 691 మార్కులతో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. ఐ.గ్రేస్‌మేరీ, డి.స్రవంతి, యల్.మమత, యం.శ్రీలక్ష్మీ, ఆర్. పూర్ణిమ వరుసగా 4,5,6,7,8 స్థానాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా మిఠాయిలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్స్ యు.మల్లిఖార్జునయ్య, టి.జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



- కృష్ణపట్నం- ఓబులవారిపల్లె రైల్వేలైన్‌పై పరుగులు తీసిన రైలు
- 1950 కోట్లతో పూర్తయిన ప్రాజెక్టు

# ఫలించిన వెంకయ్య స్వప్నం




కృష్ణపట్నం పోర్టు – ఓబులవారిపల్లె రైల్వేలైన్ రాకపోకలకు సిద్ధమైంది. ఈ నెల 25న తొలి బొగ్గులోడ్ రైలును ఈ లైన్‌పై పూర్తిగా నడిపారు. ఈ నెలాఖరు నుండి ఈ మార్గంలో సరుకు రవాణా రైళ్ళను ఎక్కువ సంఖ్యలో నడపడానికి సన్నాహాలు చేస్తున్నారు. వెంకటాచలం నుండి కడప జిల్లాలోని ఓబులవారి పల్లె వరకు రైల్వే ట్రాక్ పూర్తయినప్పటికి వెలుగొండల్లో సొరంగమార్గం పనులు పెండింగ్‌లో వుంటూ వచ్చాయి. ఎట్టకేలకు ఆ పనులు కూడా పూర్తికానిచ్చారు. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన మాల్యా ప్రత్యేక రైలులో వచ్చి ఈ రైల్వేలైనును పరిశీలించారు. సొరంగ మార్గంలో నుండి రాపూరు రైల్వేస్టేషన్ వరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు నుండి ఈ లైన్‌లో గూడ్స్ రైళ్ళను నడుపుతామని, డిసెంబర్ నుండి ప్యాసింజర్ రైళ్ళను నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

## ఇది వెంకయ్య కల..

కృష్ణపట్నంపోర్టు – ఓబులాయపల్లె రైల్వేలైన్ అన్నది భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు చిరకాల స్వప్నం. ఈ రైల్వేలైన్ ఆయన కృషి ఫలితమే! ఆయన చూపిన పట్టుదల, కృషితోనే ఈ రైల్వేలైన్ చాలా తొందరగా పూర్తికాగలిగింది.

ఈ రైల్వేలైన్‌లో డీజిల్ ట్రాక్షన్ ప్రయోగం అనంతరం స్వయంగా ఉపరాష్ట్రపతితో ఫోనులో మాట్లాడిన ఆర్వీఎన్‌ఎల్ అధికారులు, డీజిల్ ట్రాక్షన్ విజయవంతమైందని, త్వరలోనే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రైల్వే ట్రాక్షన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి, ప్యాసింజర్(ప్రజారవాణా) సౌకర్యాలు కల్పించే పనుల గురించి ఆరా తీశారు. ప్రస్తుతం పని జరుగుతోందని అధికారులు తెలియజేయగా, ఈ విషయాన్ని ఇప్పటికే రైల్వే మంత్రితో మాట్లాడానని, అవసరమైతే మరోసారి సమీక్షిస్తానని, వీలైనంత త్వరగా ఈ రైల్వే లైనును, రైల్వే బోర్డు నుంచి అనుమతులు పొంది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వెంకయ్యనాయుడు సూచించారు.

రైల్వే మంత్రిత్వ శాఖ, కృష్ణపట్నం పోర్ట్ కంపెనీ, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంలో నడిచిన ఈ ప్రాజెక్టును ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు 2002లో ఆనాటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో ప్రతిపాదించారు. నాటి రైల్వే మంత్రి నితీష్ కుమార్‌తో మాట్లాడి 2004లో మంజూరు చేయించగా, అనంతరం పనులు మొదలయ్యాయి. ఉపరాష్ట్రపతి చొరవ తీసుకుని మంజూరు చేయించిన ప్రాజెక్టు యూపీఏ హయాంలో ఆర్.వి.ఎన్.ఎల్, రైల్వేబోర్డు, అధికారుల మధ్య తలెత్తిన నిధుల వివాదం వల్ల కొంత ఆలస్యం జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి అప్పుడు కేంద్ర మంత్రిగా వున్న వెంకయ్యనాయుడు ఈ వివరాలను తీసుకెళ్ళారు. దీంతో 2014 నుంచి పనులు వేగం పుంజుకున్నాయి. ఆ తర్వాత కూడా దీని మీద అనేక మార్లు కేంద్రమంత్రిగా, తర్వాత ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు అనేక సమీక్షలు నిర్వహించారు.

1950 కోట్ల వ్యయంతో పూర్తి అయిన ఈ రైల్వేలైనును 2019 ఫిబ్రవరి 21న రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఉపరాష్ట్రపతి లాంఛనంగా ప్రారంభించారు. అయితే టన్నెల్స్ విషయంలో చిన్న పాటి పనులు పెండింగ్ ఉండడం వల్ల వాటిని పూర్తి చేసి తాజాగా డీజిల్ ట్రాక్షన్ నిర్వహించారు.

రాయలసీమ మరియు కోస్తా ప్రాంతాలను కలుపుతూ, కడప–నెల్లూరు మధ్య ముడిసరుకుల రవాణా కోసం ఉద్దేశించిన ఈ రైల్వే లైనును ప్రజా రవాణా కోసం కూడా అందుబాటులోకి తెచ్చే విషయంలో నెల్లూరీయుడిగా వెంకయ్య చేసిన కృషికి నెల్లూరీయుల తరపున అభినందనలు.



మంత్రి గౌతమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న కలెక్టర్ శేషగిరిబాబు



మంత్రి గౌతమ్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎస్పీ ఐశ్వర్యరస్తోగి

# మంత్రితో మర్యాదపూర్వక కలయిక

ఈ నెల 22వ తేదీన జిల్లాకు వచ్చిన పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు ఆయన ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి, కార్పొరేషన్ కమిషనర్ ఆలీం బాషా, జైలు ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు వున్నారు.

# 2024 ఎన్నికల్లో ఏపీలో బీజేపీ గెలుపే లక్ష్యం

2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ గెలవడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేవైయం రాష్ట్ర అధ్యక్షుడు నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. ఈనెల 24న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఇతర పార్టీల కార్యకర్తలు బీజేపీలోకి వస్తున్నారని, జనసేన పార్టీ నుంచి అనేక నియోజకవర్గాలలో కార్యకర్తలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా వున్నారని తెలిపారు. అంతకు ముందు డాక్టర్ శ్యాంప్రసాద్ వర్థంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఉదయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, కృష్ణచైతన్య, శ్రీహరి, మురళీ, ప్రసాద్ పాల్గొన్నారు.

## జగన్ దృష్టికి..

# నెల్లూరు జల సమస్యలు

### వివరించిన కలెక్టర్



నెల్లూరుజిల్లా తాగునీటి సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని, చాలా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 24వ తేదీ అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సమావేశానికి జలవనరులశాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, పరిశ్రమలశాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిలు కూడా హాజరు కావడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ ప్రస్తావించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించాలంటే చెన్నైలో మాదిరిగా డీశాలినేషన్(లవణ నిర్మూలన) ప్లాంట్‌ను నెలకొల్పాలని సూచించారు. చెన్నై సమీపంలోని మీంజూరులో 60ఎకరాల విస్తీర్ణంలో డీశాలినేషన్ ప్లాంట్ నిర్మించారని, జిల్లాలో 168 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంతం వుందని, 12 తీరప్రాంత మండలాలున్నాయని, అనువైన ప్రాంతంలో డీశాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. నెల్లూరుజిల్లాలో 940 గ్రామాలుండగా, 339 గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి అధికంగా వుందని, ట్యాంకర్ల ద్వారా ఆ గ్రామాలకు మంచినీళ్ళు సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ప్రతిపాదనల మేరకు గత నెలలో త్రాగునీటి బిల్లులకు సంబంధించి 6కోట్లు మంజూరు చేశామని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరో 10కోట్లు కేటాయించాలని ఆయన సీఎంను కోరడం జరిగింది. కలెక్టర్ వినతిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు చేయూతనందిస్తున్న...

# శ్రీసిటీ ఫౌండేషన్

### 4.55లక్షలతో నోటుపుస్తకాలు, బ్యాగులు పంపిణీ



కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాపార నగరం పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో తలపెట్టిన ఉచిత నోటుపుస్తకాలు, బ్యాగులు, పలకల పంపిణీ కార్యక్రమం ఈ నెల 20 నుంచి ప్రారంభమైంది. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజున తొండూరు, తొండూరు సొసైటీ, శ్రీహరికోట కాలనీ, సిద్ధమ అగ్రహారం, చెంగంబాక్కం పాఠశాలల్లోను, రెండవ రోజున ఇరుగులం జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో, 3వ రోజున మాదనపాలెం జడ్పీ హైస్కూలులో పంపిణీ నిర్వహించారు. ఈ విద్యాసామగ్రి మొత్తం విలువ 4.55 లక్షల రూపాయలు కాగా, తద్వారా 16 పాఠశాలలకు చెందిన 1400 మంది విద్యార్థులకు లబ్ది చేకూరుతుందని శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్ తెలియజేశారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుదల కోసం గత 9 సంవత్సరాలుగా శ్రీసిటీ ఫౌండేషన్, ఇతర పలు పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో ఏటా విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేయడం జరుగుతోంది.

అంతేకాదు, విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు, విద్యా వాలంటీర్ల నియామకం వంటి ఇతర విద్యాసదుపాయాలను కూడా చేపడుతుండడం విశేషం. విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమాల్లో ఎన్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ ప్రతినిధులు, ఆల్‌స్టామ్, ఆర్‌ఎస్ ఫోటో కటింగ్, టిట్ హెల్త్‌కేర్, ఎవెర్టన్, హెల్తియం, ఫాక్స్‌కాన్ మొబైల్స్, ఓమ్ని ఆటో, వైటల్ పేపర్, సిద్ధార్థ లాజిస్టిక్స్, రోటోలాక్ పరిశ్రమల ప్రతినిధులతో పాటు శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సత్యవేడు ఎంఇఓ రవి పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు..

# యోగా ఎంతో అవసరం

### - డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాధ్




అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ముక్కాల ద్వారకానాధ్

ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరమని, ఆర్థికవిషయాలపై అవగాహన కలిగించే ఆడిటర్లు యోగా దినోత్సవాన్ని నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు నడుం కట్టడం శుభపరిణామమని డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాధ్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఆడిటర్ల అసోసియేషన్ (సికాస) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో స్థానిక స్వతంత్రపార్కులో యోగాపై అవగాహన కల్పిస్తూ రెండురోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి సమాజానికి ఎంతో అవసరమైన యోగాపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషిచేస్తున్న సికాస ఛైర్మెన్ చిన్ని శ్రావణ్‌కుమార్‌ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యురాలు డాక్టర్ యశోధర మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ధారుడ్యాన్ని పెంచేది యోగా అని అంటూ, ఈ అవగాహన కార్యక్రమాలు ఆడిటర్ల ఆధ్వర్యంలో జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్, వైకాపా నాయకుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్యానికి యోగా ఎంతో మంచిదన్నారు. సికాస ఛైర్మెన్ చిన్ని శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఆయనే వ్యాఖ్యాతగా ఉండి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. డాక్టర్ కమలేంద్రబాబు ఇచ్చిన ఆరోగ్య సలహాలు, శ్రీరామ్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన యోగాసనాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్ మహేష్‌తో పాటు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# సి.ఐలకు స్థానచలనం

జిల్లాలో పలువురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల బదిలీలు జరిగాయి. ప్రభుత్వం మారాక కొందరికి కోరుకున్న పోస్టింగ్‌లు రాగా, ఇంకొందరికి ఆశించిన చోట పోస్టింగ్ రాలేదు. గత ప్రభుత్వంలో మెయిన్ పోస్టింగ్‌లలో వున్న సి.ఐలు ఎక్కువమంది లూప్‌లైన్లకు వెళ్లారు. బదిలీల వివరాలు ఈ విధంగా వున్నాయి.

| సి.ఐ పేరు | ప్రస్తుతం | బదిలీ సర్కిల్ |
|---|---|---|
| ఐ.శ్రీనివాసన్ | ఎక్సైజ్ | నెల్లూరు 1వ నగరం |
| షేక్ అన్వర్‌బాషా | నెల్లూరు 1వ నగరం పిఎస్ | వెంకటగిరి సర్కిల్ |
| బి.నరసింహరావు | వెంకటగిరి సర్కిల్ | చుండూరు సర్కిల్ |
| కట్టా శ్రీనివాసరావు | నవాబుపేట పిఎస్ | రేంజ్ ఆఫీసు గుంటూరు |
| కె.వేమారెడ్డి | నార్తు ట్రాఫిక్ నెల్లూరు | నవాబుపేట పిఎస్ |
| కె.నరసింహరావు | వేదాయపాళెం పిఎస్ | వాకాడు సర్కిల్ |
| ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి | వాకాడు సర్కిల్ | రేంజ్ ఆఫీసు గుంటూరు |
| వై.వి.సోమయ్య | ఇంటెలిజెన్స్ | బాలాజీనగర్ పిఎస్ |
| జి.వేణుగోపాల్‌రెడ్డి | బాలాజీనగర్ పిఎస్ | నాయుడుపేట సర్కిల్ |
| ఎంవీ సుబ్బారావు | నాయుడుపేట సర్కిల్ | వినుకొండ టౌన్ సర్కిల్ |
| కె.రామకృష్ణ | ఏసీబీ | నెల్లూరురూరల్ సర్కిల్ |
| జివిఎల్ శ్రీనివాసరావు | నెల్లూరురూరల్ సర్కిల్ | కోవూరు సర్కిల్ |
| ఏవీ శివప్రసాద్ | కోవూరు సర్కిల్ | సిపిఎస్ గుంటూరు |
| జి.దశరధరామారావు | రేంజ్ ఆఫీసు గుంటూరు | గూడూరు టౌన్ పీఎస్ |
| కె.వెంకటేశ్వరరెడ్డి | తుళ్లూరు ట్రాఫిక్-1 | సూళ్లూరుపేట సర్కిల్ |
| ఎన్.కిషోర్‌బాబు | సూళ్లూరుపేట సర్కిల్ | రేంజ్ ఆఫీసు గుంటూరు |
| టి.వి.శ్రీనివాసరావు | కలిగిరి సర్కిల్ | చేబ్రోలు సర్కిల్ |
| యూ.సత్యనారాయణ | సూర్యలంక మెరైన్ | ఉదయగిరి సర్కిల్ |
| సాంబశివరావు | ఉదయగిరి సర్కిల్ | రేంజ్ ఆఫీస్ గుంటూరు |
| ఘట్టమనేని శ్రీనివాసరావు | డిఎస్‌బి-1 నెల్లూరు | రేంజ్ ఆఫీస్ గుంటూరు |
| వి.పాపారావు | | ఆత్మకూరు సర్కిల్ |

# గూడూరు డివిజన్ వార్తలు

## బ్రాహ్మణ ప్రజాప్రతినిధులకు

# 30న ఆశీర్వచన సభ



### - యరగుడిపాటి చలపతిరావు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇటీవల ఎన్నికైన బ్రాహ్మణ ప్రజాప్రతినిధులకు నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ఆశీర్వచన పూర్వక అభినందన సభ జరుగుతుందని, ఆ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సభా నిర్వాహకులు కోరుతున్నారు. నెల్లూరులోని దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపంలో జరిగే ఈ సభలో డిప్యూటి స్పీకర్‌గా, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, శాసనసభ్యులుగా ఎన్నికైనవారికి బ్రాహ్మణ వేదపండితులచే ఆశీర్వచనం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు, గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావులు ఇటీవల జరిగిన సమాఖ్య సమావేశంలో తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కమిటీసభ్యులు కడివేటి రామమూర్తి, డి.బాల శ్రీనివాసరావు, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాసకుమార్, మహిళా అధ్యక్షులు కడివేటి పద్మజ, నాగమణి, ఎ. రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

## డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా

# పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

### - బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి



వ్రాత పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ తరఫున ఉచిత కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మెన్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12ఏళ్ళుగా సర్కారు బడుల్లో 1, 2తరగతులు చదువుతున్న పిల్లల ప్రతిభ, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను గుర్తించి మూడు నుంచి 10వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యనందిస్తున్నామన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ట్రస్టు సహకారం పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. కాగా, ఈ ఏడాది ప్రవేశాల కోసం మంగళవారం ఉదయం రోటరీ భవన్‌లో ఎంపికలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు మాత్రమే అర్హులని వివరించారు. ఈ అవకాశాన్ని పట్టణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు హరిప్రసాద్, దశరధరామిరెడ్డి, ప్రతినిధులు బి.శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్.దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు సి.ఐగా దశరథరామారావు

గూడూరు పట్టణ సి.ఐగా దశరథరామారావు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కళ్యాణరాజు బదిలీపై గుంటూరు రేంజ్‌కి వెళ్లారు. ఈ క్రమంలో జిఆర్పీ సిఐగా నెల్లూరులో విధులు నిర్వహిస్తున్న దశరథరామారావు గూడూరు పట్టణ సిఐగా సాధారణ బదిలీలలో నియమితులయ్యారు.

## రైతుబజార్‌లో

# వసతుల కల్పనకు కృషి

### - ఎమ్మెల్యే వరప్రసాదరావు



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న రైతుబజార్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చెప్పారు. ఈనెల 22న ఆయన మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మతో కలసి రైతుబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతుబజార్‌లో వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చి ఉన్నామన్నారు. ఆ హామీ నెరవేరుస్తామని, రైతులకు సౌకర్యంగా ఉండేలా మంచినీటి వసతి, మరుగుదొడ్ల సదుపాయాలు వగైరాలన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. వీరివెంట వైకాపా నాయకులు నాశిన నాగులు, బొమ్మి శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, ప్రదీప్ తదితరులున్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

# నోట్‌పుస్తకాలు పంపిణీ




చిన్నారులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్.ఐ బ్రహ్మానాయుడు

గూడూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులోని ఎస్ఎం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1వ పట్టణ ఎస్ఐ బ్రహ్మానాయుడు చేతుల మీదుగా నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.రామ్మోహన్, ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, పిఆర్‌ఓ కడివేటి చంద్రశేఖర్, మదనమేటి రమణయ్య, ఆర్‌వి రావు, సుధీర్, శ్రీనివాసులు, హెచ్ఎం సులేఖ, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో నీటికి కటకట



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న చెన్నూరు గ్రామస్తులు

గూడూరు మండలం మేజర్ పంచాయితీ చెన్నూరు గ్రామానికి కొన్ని నెలలుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెన్నూరు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన, ఆందోళన నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన మహిళలు గ్రామస్తులు కార్యాలయానికి చేరుకొని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో భాస్కర్‌రావుకు వినతిపత్రం అందించి దాహార్తి తీర్చాలని మొరపెట్టుకున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో గుక్కెడు నీటి కోసం పడరానిపాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రధాన గేటు ముందు ఖాళీ బిందెలతో మహిళలు నిరసన నిర్వహించారు.

శ్రీను గల్పిక

# బుగ్గన పనితో కలెక్టర్లకు మూర్ఛ

అది హైటెక్‌రత్న చంద్రబాబు పాతిక ప్రపంచ మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి తయారుచేసిన అమరావతి రాజధాని. ఉండవల్లిలోని ప్రజావేదిక. అక్కడ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు పలువురు మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. అందరూ ముఖ్యమంత్రి స్పీడ్‌స్టార్ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కోసం ఎదురుచూస్తున్నారు. అంతలో అక్కడకు రెండు ఆటోలు వచ్చాయి. సీఎం కోసం ఎదురుచూస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, మేకతోటి సుచరితలు... ఇక్కడకు ఆటోల్లో వచ్చిందెవరబ్బా అని ఆశ్చర్యంగా చూస్తుండగా... వెనుక ఆటోలో నుండి గన్‌మెన్‌లు దిగి ముందు ఆటో వద్దకు వచ్చి పొజిషన్ తీసుకున్నారు. అప్పుడు ముందు ఆటోలో నుండి ముందుగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దిగాడు. ఆయన్ను చూసి ఆశ్చర్యంగా అనిల్... ఎంత ఒకవేళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి హీనంగా వున్నా మీరు ఆటోలో రావడ మేంటన్నా... మీరు ఆటోలో వచ్చారని తెలిస్తే ప్రభుత్వం పరువు తీస్తున్నావని జగనన్న కోప్పడడా అని అంటుండగా... అదే ఆటోలో నుండి అప్పుడే జగన్ అడుగు బయటపెట్టాడు. ఆయన్ను చూసి అనిల్ నోటిలోని మాటను అక్కడకు కట్ చేశాడు. రామచంద్రారెడ్డి వుండి... ఏంది బాబూ ఇది... ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా వుంటే మాత్రం ఒక సీఎంగా ఇలా ఆటోల్లో తిరిగితే ఎలా అని ప్రశ్నించాడు. అప్పుడు జగన్.... చూడండి రామచంద్రన్నా... నేను కారు ఎక్కాననుకో... నా కారుతో పాటు కాన్వాయ్‌లో మరో పాతిక వాహనాలుంటాయి. ఇంటి దగ్గర నుండి ఇక్కడకు రావడానికి, పోవడానికి ఒక్కో బండికి 10లీటర్ల పెట్రోల్ లెక్కనేసుకున్నా 800 రూపాయలు. పాతిక బండ్లకు 24,000 రూపాయలవుతుంది. అదే తాడేపల్లి నుండి రెండు ఆటోలకు మేము ఇచ్చింది 300 రూపాయలు. దీనివల్ల ప్రభుత్వ సొమ్ము ఆదా కావడంతో పాటు ఇద్దరు ఆటోడ్రైవర్లకు ఈరోజుకు పని చూపించినట్లవుతుంది అని చెప్పాడు. జగన్ మాటలతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఏమీ అర్థం కాలేదు. అనిల్‌కుమార్‌యాదవ్ మాత్రం... మీ ఆశయాల బాటలో నేను కూడా నడుస్తానన్నా... కలెక్టర్ల మీటింగ్ వుంది, రమ్మనేసరికి హడావిడిగా కాన్వాయ్‌తో వచ్చాను. ఇక నుండి ఎప్పుడు అమరావతికి రావాలన్నా కాన్వాయ్ వాడను... మా నెల్లూరులో తెల్లారు జామున 4గంటలకు తిరుపతి – కాకినాడ పాసింజర్ వుంటుంది. దాంట్లో అయితే విజయవాడకు ఛార్జి 30రూపాయలే... ఇక నుండి నెల్లూరు నుండి విజయవాడకు రావాలన్నా పోవాలన్నా అదే రైలెక్కుతాను. విజయవాడ రైల్వేస్టేషన్ నుండి అమరావతికి ఆర్టీసీ బస్సు ఎక్కి వస్తుంటాను. ప్రభుత్వ ఆదాయం బాగా సేవ్ అవుతుందని చెప్పాడు. వెరీగుడ్ అనిల్, అలాగే చెయ్ అంటూ జగన్ ప్రజావేదికలోకి కదిలాడు. లోపలకు అడుగుపెట్టేసరికి కార్యదర్శులు, కలెక్టర్లు చెమటలు కార్చుకుంటూ కూర్చునివున్నారు. వాళ్ళను చూసి జగన్ బుగ్గనతో... ఏం అందరికీ చెమటలుపట్టి వున్నాయి. హాల్‌లో ఏసి వేయలేదా? కనీసం ఫ్యాన్‌లన్నా వేయలేదే? అని అడిగాడు. ముందుగానే అవి వేస్తే కరెంట్ దండగ అని వేయలేదు... అని అన్నాడు బుగ్గన. ఈ చెమటలు తట్టుకోవడం కష్టం... కనీసం గాలొచ్చే సంగతన్నా చూడు అని జగన్ చెప్పాడు. ఆ ఏర్పాట్లే చేస్తున్నా సీఎం గారు అంటూ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వెంటనే ఆ హాల్‌కు వున్న కిటికీలన్నీ తీసిపెట్టాడు. తర్వాత ఒక పెద్ద అట్టపెట్టె ఓపెన్ చేశాడు. బుగ్గన ఏంటివో గిఫ్ట్‌లు తెచ్చాడని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. బుగ్గన టక్కున అందులో నుండి విసనకర్రల కట్టలను బయటకు తీశాడు. వాటిని తెచ్చి... మొన్న డోన్‌లో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలప్పుడు తెప్పిస్తే... ఇవి మిగిలివున్నాయి. వీటితో విసురుకుంటుంటే ఏసికంటే హాయిగా వుంటుంది. అటు కరెంటు బిల్లు మిగులుతుంది ఇటు మీ చేతికి వ్యాయామం వుంటుంది అంటూ తలా ఒక విసనకర్ర ఇచ్చాడు. విసురుకోమని జగన్‌కు కూడా ఒకటిచ్చాడు. సమావేశం మొదలైంది. ఆయా జిల్లాల్లో అభివృద్ధి పనులు, వివిధ రంగాల ప్రాధాన్యతలు గురించి జగన్ సమీక్షిస్తున్నాడు. అంతలో ప్యూన్ వచ్చి అందరి ముందు డిస్పోజబుల్ గ్లాస్‌లు పెట్టాడు. తర్వాత మగ్‌తో అందరి గ్లాసుల్లో నీళ్ళు పోశాడు. బుగ్గన అందరితో... కృష్ణానది పక్కన బోరునీళ్ళు... బ్రహ్మాండంగా వుంటాయి... తాగండి అని చెప్పాడు. ఇక తప్పేదేముంది అన్నట్లు అందరూ అవే నీళ్ళు తాగారు. తర్వాత బుగ్గన ఆ హాల్‌లో ఎంతమంది వున్నారో నని లెక్కేశాడు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు కలిపి 40 మంది తేలారు. వెంటనే ప్యూన్‌ను పిలిచి.. బయట టీ కొట్టు వద్దకెళ్లి ట్వంటీబై ఫార్టీ టీ చెప్పు... బల్క్ ఆర్డర్ కాబట్టి కొంచెం రేటు తగ్గించి తీసుకోమను అని చెప్పాడు. ఆ మాట విని అక్కడే వున్న నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుకు భలే బాధేసింది. చంద్రబాబు రాష్ట్రాన్ని ఇంతగా దివాళా తీయించాడా... అతని దుబారా మూలంగా మాకు ఫుల్ టీ తాగే అదృష్టం కూడా లేకుండా పోయిందా అని మనసులో అనుకున్నాడు. అప్పుడే కెటిల్‌తో టీబాయ్ లోపలకు వచ్చాడు. అందరి ముందు డిస్పోజబుల్ కప్‌లు పెట్టి కొలత పెట్టి పోసినట్లు ప్రతి కప్పులో సగం టీ పోసి వెళ్లిపోయాడు. అందరూ టీ తాగారు. తర్వాత జగన్ మీటింగ్ కంటిన్యూ చేస్తూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదు. మీ స్థాయిలలో పొదుపు చర్యలు బాగా పాటించండి... దుబారాను తగ్గించండి, అనవసరమైన పనులను ఆపేయండి అని చెప్పాడు. అంతలో స్నాక్స్ బ్రేక్ వచ్చింది. అందరూ జీడిపప్పు, బాదం, పిస్తా పప్పు వస్తుందేమోనని ఎదురుచూస్తుండగా, లోపలకు ప్యూన్ వచ్చి అందరి చేతుల్లో ఒక్కో పొట్లం పెట్టాడు. బుగ్గన వారితో... అవి ఉడకపెట్టిన వేరుశెనక్కాయలు... ధర తక్కువ, ఆరోగ్యం ఎక్కువ, జీడిపప్పు ధర ఎక్కువ... కొవ్వు కూడా ఎక్కువే... దీని కంటే వేరుశెనక్కాయలు ఎంతో ఆరోగ్యకరం అని చెప్పి తినమన్నాడు. అందరూ తిన్నారు. తర్వాత ఇంకో రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా మీటింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటలు కావడంతో... జగన్ వుండి... ముందు తిందాం... తర్వాత పనిలో కూర్చుందాం అని చెప్పి లేచాడు. లంచ్‌లో మటన్ బిర్యానీ, కీమారోల్స్, ఫిష్ ఫ్రై, చికెన్ కుర్మా లాంటివి వుంటాయిలే అని అనుకుంటూ అందరూ డైనింగ్‌హాల్‌లోకి వెళ్లారు. అక్కడ నిర్మానుష్యంగా ఉంది... ఓ టేబుల్ మీద మాత్రం రెండు పెద్ద హాట్‌బాక్స్‌లున్నాయి. వాటిపక్కన చిన్న చిన్న ప్రసాదం కప్పులున్నాయి. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆ టేబుల్ వద్దకెళ్లి... మంగళగిరి పానకాలస్వామి గుడిలో ప్రసాదాలు... మిగిలితే తెప్పించాను. పులిహోర, దద్దోజనం... తలా రెండు కప్పులు తినండి... లంచ్ అయిపోతుంది... ఎక్కువ తిన్నా నిద్రవస్తుంది. మీటింగ్‌లో సరిగా వుండలేరు అని చెప్పి... అందరికీ తన చేత్తోనే ప్రసాదాలు అందించాడు. అందరూ ఆకలవుతుండడంతో అవే తిన్నారు. తర్వాత మీటింగ్ మొదలై సాయంత్రం 4గంటలదాకా సాగింది. మీటింగ్ అయిపోయాక అందరితో బుగ్గన..... మధ్యాహ్నం అందరూ చాలీచాలకుండా తిన్నారు... నైట్ తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో డిన్నర్ వుంది... మటన్ బిరియాని... చికెన్ పులుసు వుంటుంది. అందరూ అక్కడకు రండి అని ఆహ్వానించాడు. తర్వాత బయటకొచ్చి జగన్, బుగ్గనలు ఆటో ఎక్కగా, ఇక తప్పదన్నట్లు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లు కూడా అదే ఆటోలో ఇరుక్కుని వెళ్లారు.

రాత్రి 8గంటలైంది. కలెక్టర్లు, కార్యదర్శులందరూ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసుకు చేరుకున్నారు. బుగ్గన అందర్నీ విందు ఆరగిద్దురు రండంటూ డైనింగ్ హాల్‌లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. అందరి ముందు విస్తర్లు వేశారు. తర్వాత తెల్లన్నం వడ్డించారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు వుండబట్టలేక... సార్, మటన్ బిరియాని అన్నారు, చికెన్ పులుసు అన్నారు, ఇదేంటి వట్టి అన్నం వడ్డించారని అడిగాడు. అప్పుడు బుగ్గన అటు చూడు అంటూ వేలును పైకి చూపించాడు. అక్కడ ఒక పొట్టేలు, ఒక కోడి వేలాడదీసి వున్నాయి. బుగ్గన వాటిని చూపిస్తూ... ఆ రెండింటిని చూస్తూ ఈ వట్టి అన్నం తింటుంటే మటన్ బిర్యాని, చికెన్ పులుసు తింటున్నట్లుగా ఉండదూ అని చెప్పాడు. ఆ మాట వినగానే సగం మంది అధికారులు కిందపడిపోయి చెయ్యి, కాలు కొట్టుకోసాగారు.

# వాస్తవికతకు ప్రతిబింబాలు.. పోట్లూరు కథలు

## – 'చింకిచాప' కథాసంపుటి ఆవిష్కరణలో వక్తలు



పోట్లూరు కథలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయని, సమాజానికి ఉపయోగకరంగా.. ఆలోచనాత్మకంగా ఈ కథలు ఉండడం వల్ల వాటిని పాఠకులు బాగా ఆదరిస్తుంటారని వక్తలు కొనియాడారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ కథారచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యం రచించిన 'చింకిచాప' కథల సంపుటిని ఈనెల 23న నెల్లూరులోని ఆదిత్య కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన 30కథలను పోట్లూరు ఒక కథా సంపుటిగా ప్రచురించడం పట్ల కథారచయితలు సంతోషం వ్యక్తం చేశారు. కథా రచయితగా, నవలా రచయితగా పోట్లూరు పేరెన్నికగన్నారని, సింహపురిసీమ కథా–నవలా రచనా రంగంలో పోట్లూరు తనకంటూ ప్రత్యేకస్థానం ఏర్పరుచుకున్నారని వక్తలు అభినందించారు. వీరి రచనలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయని, ఎన్నో అవార్డులు పొందిన వీరి కథల మీద పరిశోధనలు చేసి పలువురు ఎంఫిల్, పిహెచ్‌డిలు పొంది వున్నారన్నారు. ఆచార్య ఆదిత్య అధ్యక్షత వహించిన ఈ పుస్తకావిష్కరణ సభలో చెన్నైకి చెందిన విశ్రాంత తెలుగుశాఖ అధ్యక్షురాలు డా.నిర్మల పళనివేలు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోట్లూరు కథలు సమాజంలోని సంఘటనలకు, వాస్తవిక జీవితాలకు ప్రతిబింబాలుగా ఉంటాయని, ఈ కథాసంపుటిలోని ప్రతి కథా పాఠకులను బాగా ఆకట్టుకుంటుందని ప్రశంసించారు. జనని సాంస్కృతిక సంస్థ–చెన్నై ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, జాషువా కవితాపీఠం అధ్యక్షులు విద్వాన్ కిరణశ్రీ, పెరసం ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధరబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పోట్లూరు సాహిత్యవేదిక ఆధ్వర్యంలో ఈ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్, కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, కవయిత్రులు పెరుగు సుజనారామం, తోట సులోచన, సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రశాంత వాతావరణం...

# క్రీడల వల్లే సాధ్యం

– ముక్కాల ద్వారకానాథ్




ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న ముక్కాల ద్వారకానాథ్, కనకదుర్గా భవాని

కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ఒక మంచి సుప్రశాంత వాతావరణం క్రీడల వల్లే సాధ్యమవుతుందని నెల్లూరు ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్‌ను పురస్కరించుకుని ఈనెల 22న నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. మద్రాసు బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వీఆర్సీ సెంటర్, గాంధీ బొమ్మ మీదుగా తిరిగి వీఆర్సీ స్కూలు మైదానానికి చేరుకుంది. ర్యాలీని ప్రారంభించిన ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. సెట్నల్ సీఇఒ కనకదుర్గా భవాని మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి క్రీడా ప్రాధికార సంస్థ ఎప్పుడూ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులకు సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వారు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఒలింపిక్ అసోసియేషన్ సీఈఓ పసుపులేటి రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి అరిగెల విజయకుమార్, సింహపురి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీఎస్ఏ చీఫ్ కోచ్ పాండురంగారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నవాబుపేట సి.ఐగా వేమారెడ్డి

నెల్లూరు నగరం నవాబుపేట(టూటౌన్) సి.ఐగా వేమారెడ్డి 24వతేదీ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నార్త్‌ట్రాఫిక్ సి.ఐగా విధులు నిర్వహిస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. రేంజ్ విఆర్‌లో వున్న ఆంజనేయరెడ్డిని నార్త్ ట్రాఫిక్ సి.ఐగా నియమించారు.



## రైతు దినోత్సవంగా...

# రాజన్న జన్మదినం

**దివంగత నేత వై.యస్. రాజశేఖరరెడ్డి జయంతిని రైతు దినోత్సవంగా జరపాలి... 2010 జూలై8వ తేదీన నెల్లూరులోని టౌన్‌హాల్ వేదికగా నినదించిన డిమాండ్. ఈరోజు అది సాకారమయ్యింది. ప్రతిఏటా వై.యస్. జయంతిని రైతు దినోత్సవంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**



2010 జూలై 8వ తేదీన వై.యస్.జన్మదినోత్సవాన్ని 'రైతు దినోత్సవం'గా జరుపుకున్న వై.యస్. సేవాసమితి సభ్యులు (ఫైల్ ఫోటో)

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి ఆప్తులు, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు అయిన తుంగా శివప్రభాత్‌రెడ్డి గౌరవాధ్యక్షుడిగా వున్నటువంటి 'వై.యస్. సేవాసమితి' ఆధ్వర్యంలో ప్రతియేటా వై.యస్.జన్మదినోత్సవం రోజున సేవా మహోత్సవాలు జరిగేవి. 2009 జూలై 8వ తేదీన వై.యస్. షష్ట్యబ్ది ఉత్సవాలను 'సేవా మహోత్సవం' పేరుతో వై.యస్. సేవాసమితి ఎంతో ఘనంగా నిర్వహించింది. డాక్టర్ వై.యస్. దివంగతులయ్యాక 2010 జూలై 8వతేదీన ఆ మహనీయుడి జయంతిని జరుపుకోవాల్సి వచ్చింది. ఆనాటి నెల్లూరురూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.రాంగోపాల్ తదితర ప్రముఖులు పాల్గొన్న ఆ జయంతి సభను రైతు దినోత్సవంగా జరపడమే కాకుండా ప్రతియేటా వై.యస్. జయంతిని రైతు దినోత్సవంగా ప్రభుత్వమే అధికారికంగా జరపాలని వై.యస్. సేవాసమితి పక్షాన సంస్థ గౌరవాధ్యక్షుడు ప్రభు ఆ సభలోనే డిమాండ్ చేశాడు. ఈ సందర్భంగా నగరంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులకు 'వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్', 'డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి వ్యక్తిత్వం, పరిపాలన' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా 1500 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. విజేతలకు స్కాలర్‌షిప్, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, వై.యస్ ఆశయాలకు అనుగుణంగా ఆ కార్యక్రమంలో ఆరుగురు రైతులను సత్కరించారు.

ఈ రాష్ట్రాన్ని ఏలిన ముఖ్యమంత్రులలో రైతు పక్షపాతి ఎవరన్నావున్నారు అంటే అది వై.యస్.రాజశేఖరరెడ్డే! రైతాంగానికి ఆయన చేసినంత మేలు ఎవరూ చేసివుండరు. ఆయన తదనంతరం ముఖ్యమంత్రులైన రోశయ్య లేదా కిరణ్‌కుమార్ రెడ్డిల హయాంలోనే వై.యస్. జయంతిని 'రైతు దినోత్సవం'గా అధికారికంగా ప్రకటించి వుండాలి. కాని, సోనియాగాంధీ భయంతో వాళ్ళు ఆ పని చేయలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎలాగూ చేయడు.

ఎట్టకేలకు వైసిపి అధికారంలోకి రావడంతో వై.యస్.జన్మదినోత్సవాన్ని రైతు దినోత్సవంగా జరపాలన్న వై.యస్. సేవాసమితి ఆశయం 9ఏళ్ళ తర్వాత నెరవేరింది.



ఇటీవల హైదరాబాద్‌లో సూపర్‌స్టార్ కృష్ణ - విజయనిర్మల దంపతులను వారి నివాసంలో కలిసి ఆత్మీయంగా ముచ్చటిస్తున్న ప్రముఖ వైద్యులు, ఆలిండియా తెలుగు ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సి.యం.కె.రెడ్డి

# పతిని వీడిన సతి

- కన్నీరుమున్నీరైన కృష్ణ
- మహానటి విజయనిర్మల మరణంతో శోకసాగరమైన సినీరంగం



**ప్రముఖ నటి, దర్శకురాలు, సూపర్‌స్టార్ కృష్ణ సతీమణి విజయనిర్మల ఇక లేరు. ఆమె వయసు 73సంవత్సరాలు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ 26వ తేదీ బుధవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమె మృతితో కృష్ణ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సతిని ఎడబాసిన పతిలా.. శూన్య హృదయంతో ఒంటరివాడైపోయినట్లుగా విలవిల్లాడాడు. అత్యంత ఆత్మీయతతో.. అనురాగంతో అనుక్షణం తన వెంట ఉండే తన జీవితభాగస్వామి ఇక లేరనే బాధను తట్టుకోలేక.. ఆమె పార్థివదేహం వద్ద ఆయన కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న దృశ్యాలు అశేషప్రజల హృదయాలను ద్రవింపజేశాయి. మహానటి విజయనిర్మల మృతితో వారి కుటుంబంతో పాటు, సినిమారంగం శోకసాగరంలో మునిగిపోయింది.. తెలుగు ప్రజలే కాక దేశవ్యాప్తంగా వున్న వారి అభిమానులు.. అసంఖ్యాక సినీ ప్రేక్షకులు ఆమె మృతికి తీవ్ర ఆవేదన చెందారు. ఎందరో సినీప్రముఖులు తరలివచ్చి ఆమె పార్థివదేహాన్ని కడసారి సందర్శించుకుని కన్నీటి నివాళులర్పించారు.**

అన్యోన్యమైన దాంపత్యబంధానికి, అపురూపమైన ఆత్మీయతానుబంధానికి ప్రతిరూపాలుగా ఎవరైనా ఉన్నారంటే.. వారే 'కృష్ణ-విజయనిర్మల'. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే ఆ ప్రేమైక దంపతులు ఒకేమాటగా.. ఒకేబాటగా నడిచి సినీరంగంలో ఎన్నో సంచలనాలు సృష్టించారు. దాదాపు 50 సినిమాల్లో వీరిద్దరూ కలసి నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారు. అంతెందుకు, 'కృష్ణ-విజయనిర్మల' అనే జంటపదాలు ఒకటిగా తెలుగుప్రజల్లో స్థిరపడిపోయాయంటే అతిశయోక్తి కాదు.



**బాలనటిగా సినీరంగ ప్రవేశం :**

పసివయసులోనే తమిళ చలనచిత్ర రంగంలో బాలనటిగా ప్రవేశించిన విజయనిర్మల స్వస్థలం నరసరావుపేట. 1946 ఫిబ్రవరి 20న ఆమె జన్మించారు. కొంతకాలానికి తల్లిదండ్రులతో కలసి మద్రాసుకు వెళ్ళిపోయారు. దర్శకుడు పి.పుల్లయ్య దర్శకత్వంలో 'మత్స్యరేఖ' తమిళచిత్రంలో బాలనటిగా సినీరంగంలో ప్రవేశించి అత్యద్భుతమైన అభినయం, నటనా చాతుర్యంతో నటనారంగంలో విజయనిర్మల తన ప్రతిభాపాటవాలు చాటుకున్నారు. పాండురంగమహాత్మ్యం సినిమాలో శ్రీకృష్ణ పాత్రలో నటించి బాలనటిగా తెలుగుసినీరంగంలో అడుగు పెట్టారు. చిన్నతనం నుంచే అత్యద్భుతమైన నటనాభినయంతో ఆమె తనదంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్నారు.

**మహిళా దర్శకురాలిగా విశేష ఖ్యాతి**

దాదాపు 200కుపైగా తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లో నటించడమే కాక, ప్రత్యేకించి 44సినిమాలకు దర్శకత్వం వహించి తొలి మహిళా దర్శకురాలిగా విజయనిర్మల ఎంతో అరుదైన.. విశిష్టమైన ఖ్యాతిని ఆర్జించారు. పట్టుదల ఉండాలే గానీ.. సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ..ఆమె ఎంతో కష్టసాధ్యమైన దర్శకత్వ రంగంలో అడుగిడి నిరంతర శ్రమతో అద్భుతాలెన్నో సృష్టించారు. ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలను ప్రేక్షకలోకానికి అందించారు. అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన తొలి మహిళా దర్శకురాలిగా గిన్నిస్‌బుక్ రికార్డ్‌ను సాధించి ప్రపంచవ్యాప్తంగా తెలుగు మహిళాశక్తిని చాటారు. అంతేకాదు, 15 చిత్రాలను స్వయంగా నిర్మించి అత్యంత ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డును కూడా సాధించి దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలనందుకున్న ఘనకీర్తి తెలుగు సినిమా రంగంలో ఒక్క విజయనిర్మలకే దక్కిందంటే అతిశయోక్తి కాదు. విలక్షణమైన నటిగా రాణిస్తూ.. ఎన్నోరకాల పాత్రలకు ఆమె జీవం పోశారు. తెలుగు, తమిళం, మలయాళం సినిమాల్లో ఆమె హీరోయిన్‌గా నటించిన ఎన్నో చిత్రాలు సూపర్‌హిట్ అయ్యాయంటే అవి ఆమె నటనాభినయానికి మచ్చుతునకలు. సూపర్‌స్టార్ కృష్ణతో వివాహమయ్యాక కూడా ఆమె 43 సినిమాల్లో కృష్ణతో కలసి నటించి సినీచరిత్రలోనే అమోఘమైన రికార్డు సృష్టించారు. మీనా, రంగులరాట్నం, సాక్షి, విచిత్ర కుటుంబం, వెూన గాళ్ళకు మోసగాడు, భలే మోసగాడు, బంది పోటు భీమన్న, అల్లూరి సీతారామరాజు, అక్కాచెల్లెలు, ధనవంతుడు గుణవంతుడు.. ఇలా ఒకటేమిటి ఎన్నో చిత్రాలు ఆమె నటనకు, దర్శకత్వ ప్రతిభకు తార్కాణంగా నిలుస్తాయి.

## 'లాయర్'తో ఆత్మీయతానుబంధం



3వ తుంగా పండుగను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న విజయనిర్మల - కృష్ణ దంపతులు

సూపర్‌స్టార్ కృష్ణ-విజయనిర్మల దంపతులతో 'లాయర్'వారపత్రికకు ఎంతో ఆత్మీయతానుబంధం ఉంది. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాల్‌రెడ్డి గారి 69వ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని 1998 నవంబరు 8వ తేదిన నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన తుంగా పండుగలో సూపర్‌స్టార్ నటశేఖర కృష్ణ, విజయనిర్మల దంపతులు పాల్గొని ఆ సభకు నిండుదనం తెచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ గారికి 'తుంగా అవార్డు'ను బహుకరించడం జరిగింది. ఈ సభలో విజయనిర్మల మాట్లాడుతూ, "సాధారణంగా పెద్దవారికి 60 ఏళ్లు దాటితే ఎప్పుడెప్పుడు పోతారా అని ఎదురుచూసే కొడుకులున్న ఈ రోజుల్లో తండ్రి పేరుతో పండుగలు చేసే శివప్రభాత్‌రెడ్డి వంటివారు ఉండబట్టే ఇంకా ఈ సమాజంలో మంచి కొంచెమైనా మిగిలివుందని కొనియాడారు. సూపర్‌స్టార్ కృష్ణ మాట్లాడుతూ తాను 14ఏళ్ళ తర్వాత ఇప్పుడు నెల్లూరుకు వచ్చానని, సభలకు వచ్చి సన్మానాలు చేయించుకోవడం తనకు ఇష్టం లేదని, అయితే, తన తండ్రి పేరుమీద ప్రభు ఇంత మంచి సభ జరుపుతుంటే కాదనలేకపోయానన్నారు.

కాగా, భారీవర్షాల కారణంగా మద్రాసులోని రెడ్‌హిల్స్ వద్ద బ్రిడ్జి కూలిపోయి రోడ్డు మార్గాన రాకపోకలు నిలిచిపోయినా, కృష్ణ-విజయనిర్మల దంపతులు వెనుదిరిగి రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ నుండి నేరుగా రైల్లో నెల్లూరుకు వచ్చి 'తుంగా పండుగ'లో పాల్గొనడం వారి సహృదయతకు నిదర్శనం. చెన్నైలోని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ సి.యం.కె.రెడ్డి గారి ద్వారా కృష్ణ గారి కుటుంబంతో 'లాయర్'కు ఈ ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. ఏదేమైనా, ఇంత గొప్ప సంస్కారం, సహృదయత ఉన్న మహానటి విజయనిర్మలగారి మృతి మాకెంతో ఆవేదన కలిగిస్తోంది. ఆమె మృతితో... విషాదసంభరిత హృదయాలతో విలపిస్తున్న కృష్ణ గారికి, వారి కుటుంబ సభ్యులందరికీ 'లాయర్' ప్రగాఢసంతాపం తెలియజేస్తోంది.

## పంచాయతీరాజ్ ఇంజనీర్ల బదిలీలను

# పారదర్శకంగా జరపాలి

### రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



గోపాలకృష్ణ ద్వివేదికి అభినందనలు తెలుపుతున్న రియాజ్ అహ్మద్

త్వరలో జరుగనున్న పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల్‌కృష్ణ ద్వివేదికి విన్నవించామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ద్వివేదిని గౌరవపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశామని, ఈ సందర్భంగా డిప్లొమా ఇంజనీర్ల సమస్యలను వివరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బదిలీలు చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కార్యదర్శి రమణ, ఆంజనేయులు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటుపుస్తకాలు



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీచేస్తున్న మల్లు విజయకుమార్‌రెడ్డి

గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిప్పవరప్పాడు ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులకు ఇటీవల నోట్‌బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైకాపా మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి పాల్గొని పుస్తకాలు పంపిణీ చేశారు. అధ్యక్షులు జి.చంద్రశేఖర్, పిఆర్‌ఓ కడివేటి చంద్రశేఖర్, మదనమేటి రమణయ్య, కాటూరు శ్రీనివాసులు, హెచ్‌ఎం భ్రమరాంబ, సునీత, కృష్ణయ్య పాల్గొన్నారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం రోజున అందజేసే పద్మ అవార్డుల కోసం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారు దరఖాస్తు చేసుకోవాలని సెట్నెల్ సీఇఓ యస్. కనకదుర్గా భవాని ఈనెల 25న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారు అర్హులుగా పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఏడీఎంఏఏడబ్ల్యూఏఆర్డీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా తమ దరఖాస్తులు పూర్తిచేసి ఈనెల 30వతేదీలోగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు.

# ఇన్నర్‌వీల్‌క్లబ్ సహకారం



పాఠశాలకు క్రీడాసామగ్రిని అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల అభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ సహకారం అందిస్తుందని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు, ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో ఈనెల 23న జరిగిన కార్యక్రమంలో కోటమండలం కొత్తపాళెం గ్రామంలోని పాఠశాలకు ఆమె ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ సహకారంతో పదివేలరూపాయల విలువజేసే క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి క్లబ్ సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.

# అక్షర నెగళ్ళు

నా శరీర స్పర్శ
నా ఆలోచనల వాసన తెలిసిన కాలం
రోజూ నన్ను బహిష్కరిస్తుంటుంది
గతాన్ని తలుచుకోమని
భుజాలపై చేతులేసి
రాత్రుళ్ళను నెగళ్ళుగా మారుస్తుంది
ఒక్కోసారి అకారణ ద్వేషం
నెత్తుటి ముద్దగా మారి
నన్ను కట్టెను చేసి
నిలువెల్లా దహించి వేస్తుంది
అప్పుడు నా కవితా ప్రవాహం ప్రారంభమవుతుంది
నలిగి నలిగి ఆత్రంగా పేర్చుకొన్న
అక్షరాలకి గొంతునిచ్చి
మౌన ప్రవాహం లోకి జారుకొంటాను
నిన్న మొన్నటి దాకా నిన్నూ, నీ స్నేహాన్ని
నీ సమస్తాల్నీ ఇముడ్చుకొన్న మనుషులకు
ఏవీ గుర్తుండవు
నేనే మనిషిలోంచి
అక్షరాల దారుల్లోంచి
అమాయకంగా తొంగి చూస్తుంటాను
నా ఏకాంతంలో ప్రపంచాన్ని పరుచుకొని
మనిషి అంతరాల కందకాల్లోకి చూపులు దించి
దీనంగా చూస్తుంటాను
నిజం నన్ను నీడగా వెంటాడుతున్నా
కలలు నన్ను తన బాహువుల్లోకి
లాక్కుంటూనే వుంటాయి
ఎక్కడో పట్టు జారి పోతున్నా
అక్షరం వేయి వసంతాలను పూయిస్తుంది

ఏటూరి నాగేంద్రరావు
7416665323

# అక్రమాలపై... ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్నన్ని వేగవంతమైన నిర్ణయాలు చరిత్రలో ఒక నెలరోజుల కాలంలో ఏ ముఖ్యమంత్రి కూడా తీసుకుని వుండడు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా ప్రజలకిచ్చిన హామీలపై చకచకా ముందడుగువేసుకుంటూ పోతున్నాడు.

ఇవన్నీ ఒక స్టైల్ సినిమాను తలపిస్తుంటే, కృష్ణానది కరకట్ట మీద గత తెలుగుదేశం ప్రభుత్వం అక్రమంగా నిర్మించి ప్రజావేదికలో కలెక్టర్ల సదస్సు పెట్టి... ఆ సదస్సులోనే... మనం ఒక అక్రమకట్టడంలో కూర్చుని ఈరోజు కాన్ఫరెన్స్ పెట్టుకున్నాం... ఇది అక్రమ కట్టడం... ఇది మీకు చూపించడానికి ఇక్కడ సదస్సు పెట్టాము... అక్రమ నిర్మాణాల తొలగింపు ఇక్కడనుండే మొదలుకావాలి... అంటూ జగన్ అన్న మాటలతో ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు సైతం ఉలిక్కిపడ్డారు. జగన్ మొండివాడని తెలుసుగాని, ఇంత మొండిగా వుండడం వాళ్ళు కూడా ఇప్పుడే చూస్తున్నారు.

కృష్ణానది కరకట్టపై నిర్మాణాలేవీ చేపట్టకూడదు. అయితే కొందరు ప్రైవేట్ వ్యక్తులు గెస్ట్‌హౌస్‌లు, ఆశ్రమాలు, ఆయుర్వేద కేంద్రాలు కట్టుకునివున్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక కరకట్ట మీదున్న లింగమనేని గెస్ట్‌హౌస్‌ను తన క్యాంప్ ఆఫీసుగా మార్చుకున్నాడు. లింగమనేని గెస్ట్‌హౌస్ ఒక అక్రమకట్టడం. అనుమతులు లేవు దాంట్లో ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు ఉండడమే పెద్ద తప్పు. ఇది చాలదన్నట్లు దానికి అనుబంధంగా ప్రభుత్వ వ్యయంతో 'ప్రజావేదిక' అనే పేరుతో ఇంకో భవనం కట్టారు. దీనికి ప్రభుత్వ అవసరాల కంటే కూడా పార్టీ అవసరాలకు ఎక్కువగా వాడుతుండే వాళ్ళు. ఇది ప్రభుత్వ అక్రమకట్టడం. దీనికి ఎలాంటి అనుమతులు లేవు. అసలు నదీపరివాహక చట్టాలకు ఇది విరుద్ధం. అయినా రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు దీనిని అధికారబలంతో కట్టారు.

నిన్నటి ఎన్నికల తర్వాత ప్రతిపక్షంలోకి వచ్చిన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు 'ప్రజావేదిక'ను ప్రతిపక్ష నేతగా తన కార్యకలాపాల కోసం కేటాయించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ వ్రాయడం జరిగింది. దీనిపై ప్రభుత్వం అప్పుడు స్పందించలేదు. అసలు స్పందనేంటో ఇప్పుడు ప్రత్యక్షంగా చూపించారు. ప్రజావేదికను అక్రమకట్టడంగా, గత తెలుగుదేశం ప్రభుత్వం అధికార మదంతో చేసిన తప్పుగా కళ్ళకు కట్టినట్లు చూపించి దానిని తొలగించారు. ఇప్పుడు కరకట్ట మీద చంద్రబాబు నివాసంతో పాటు మరెన్నో అక్రమ కట్టడాలున్నాయి. వీటిలో కొన్నిటిపై కోర్టు స్టేలున్నాయి. కాబట్టి వీటిని కూడా కూలుస్తారా లేదా అన్నది ముందు ముందు తేలాలి.

కాని, ప్రజావేదిక కూల్చడం అన్నది అక్రమ కట్టడం దార్లకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన సీరియస్ వార్నింగ్. ఇదే సమయంలో అవినీతిని, అక్రమాలను సహించొద్దని, ఈ విషయంలో ఎవరి సిఫార్సులను లెక్కచేయొద్దంటూ జగన్ ఇచ్చిన భరోసాతో అధికార యంత్రాంగం అత్యంత ఉత్సాహంగా వుంది. అధికార యంత్రాంగానికి ఈ మాత్రం భరోసా, ప్రోత్సాహం వుంటే వ్యవస్థల్లో కొంతవరకన్నా మార్పు లొస్తాయి.

# టీడీపీ సెల్ఫ్‌గోల్!

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీలో చేరారని అందరూ ఇప్పుడు బలంగా నమ్ముతున్నారు. చంద్రబాబుపై ఓటు-నోటు కేసు, పాతికేసులతో పాటు గత 5ఏళ్ల పరిపాలనను లోతుగా తవ్వితే లెక్కలేనన్ని కేసులు పెట్టుకోవచ్చు. ఇక సుజనాచౌదరి, సీఎం రమేష్‌పై బ్యాంకు బకాయిల కేసులు, ఐటి దాడుల కేసులు ఎలాగూ ఉన్నాయి. వీటన్నింటి నుండి తాము బయటపడాలన్నా, తమ బాస్ చంద్రబాబును బయటపడేయాలన్నా బీజేపీ శరణుకోరడమే మార్గంగా భావించారు. చంద్రబాబు సూచనల మేరకే నలుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారు. సుజనా, సీఎం రమేష్‌లు విలువలు వదిలి పార్టీ మారారంటే అర్థముంది. కాని, టి.జి.వెంకటేష్‌పై ఎలాంటి కేసులు లేవు. వివాదాస్పదుడు కాదు. ఇప్పటికిప్పుడు ఆయన బీజేపీలో చేరాల్సిన అవసరం కూడా లేదు. ఇక చంద్రబాబు డైరెక్షన్ కాబట్టి, నలుగురు సభ్యులు లేకపోతే టిడిపి పార్లమెంటరీ పార్టీ బీజేపీలో విలీనం కాలేదుకాబట్టి టి.జి.ని, గరికపాటి రామ్మోహన్‌రావులను కూడా కలిపి బీజేపీలోకి తోశారు. బీజేపీతో సంబంధాలు పునర్నిర్మితమైతేనేగాని కేసుల నుండి బయటపడలేమన్న భయమే చంద్రబాబును ఈ పనికి పురికొల్పినట్లుగా తెలుస్తోంది.

## గోతిని తవ్వుకోవడమే!

అయితే ఇక్కడ చంద్రబాబు కేవలం తన కేసుల సంగతి చూసుకున్నాడేగాని, తెలుగుదేశం భవిష్యత్ ఏంటన్నది ఆలోచించలేదు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ వున్న దీనావస్థలో ఆ పార్టీలో వుండాలని ఏ నాయకుడు కూడా అనుకోడు. సుజనాచౌదరి, సీఎం రమేష్‌లాంటి వాళ్ళే పార్టీ మారాక ఇంకెవరు కూడా తెలుగుదేశంలో నిలవాలనుకోరు. తెలుగుదేశం నుండి బీజేపీ లేదా వైసిపిలో చేరాలనుకుంటున్న ఆ పార్టీ నాయకులకు ఈ చర్య ద్వారా చంద్రబాబే స్వయంగా తన చేతో గేటు తీసినట్లయ్యింది. రాజకీయాలలో సెల్ఫ్‌గోల్ వేసుకోవడం అంటే ఇదే! ఈ నలుగురు ఎంపీల పార్టీ మార్పు ప్రభావం త్వరలో తెలుగుదేశంపై తీవ్రంగానే ఉండబోతోంది.

## కాలధర్మం

# కాసు సరోజనమ్మ



నెల్లూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్, ఆంధ్రా బ్యాంక్ మాజీడైరెక్టర్ కాసు సుధాకర్ మాతృమూర్తి కాసు సరోజనమ్మ ఈనెల 20వతేదీ గురువారం స్వర్గస్థురాలైనారు. ఆమె వయసు 94సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. జలదంకి మండలం తిమ్మసముద్రం వారి స్వగ్రామమైనప్పటికీ కాసు కుటుంబం సరోజనమ్మ పుట్టిన వూరైన చేజర్ల మండలంలోని గొల్లపల్లిలోనే ఎక్కువ కాలం నివసించారు. తర్వాత కొడుకుల చదువులు, వృత్తుల రీత్యా నెల్లూరుకొచ్చారు. సరోజనమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com